ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
మంగళవారం 3 సెప్టెంబరు 2024





రైళ్లు రద్దు కావడంతో ఖాళీగా ఉన్న ప్లాట్‌ఫారాలు

అప్పుడూ ఇప్పుడూ వారే!



వైసీపీ నేతలతో అంటకాగిన వారికే కూటమి ప్రభుత్వంలోనూ ప్రాధాన్యం

- పోలీస్ శాఖ, జీవీఎంసీలలో బదిలీలు/పోస్టింగ్‌ల తీరుపై కూటమి శ్రేణుల్లో అసంతృప్తి
- గతంలో టీడీపీ కార్యాలయం వద్ద నేతలను ఇబ్బందిపెట్టిన సీఐకు మంచి పోస్టింగ్
- తమ నేతలకు పార్టీ కంటే వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యమై పోయాయని కార్యకర్తల విమర్శలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో చక్రం తిప్పిన అధికారులకే కూటమి ప్రభుత్వంలోనూ ప్రాధాన్యం దక్కుతోంది. వైసీపీ నేతలతో అంటకాగిన పోలీస్, జీవీఎంసీ అధికారులు తాజాగా జరిగిన బదిలీల్లో కీలక పోస్టులను దక్కించుకున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నిబంధనల కంటే ఆ పార్టీ నేతల ఆదేశాలే శిరోధార్యమన్నట్టు వ్యవహరించిన అధికారులు...ఇప్పుడు కూటమి నేతల పంచన చేరారు. గతంలో తమ పట్ల అమానుషంగా ప్రవర్తించిన అధికారులు కీలక పోస్టుల్లోకి రావడంపై టీడీపీ, జనసేన కార్యకర్తలు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నాయి. తమ నేతలకు పార్టీల కంటే వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యమైపోయాయని మండిపడుతున్నారు.

నగర పోలీస్ కమిషనరేట్‌లో ఇటీవల సీఐల బదిలీలు జరిగాయి. వైసీపీ ప్రభుత్వంలో కొంతమంది సీఐలు హవా చలాయించారు. ఆ పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులతో అంటకాగుతూ వారి ఆదేశాలను తూచా తప్పకుండా పాటించారు. ఎన్ని విమర్శలు వచ్చినా లెక్కచేసేవారు కాదు.



సాధారణ ఎన్నికల సమయంలో నిబంధనల ప్రకారం నగరంలో మూడేళ్లపాటు పనిచేసిన పోలీస్ అధికారులను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. తర్వాత కూటమి అధికారంలోకి రావడంతో అలాంటి వారికి నగరంలోకి తిరిగి వచ్చేందుకు అవకాశాలు ఉండవని అంతా భావించారు. అయితే ఇటీవల జరిగిన బదిలీల్లో ఇతర జిల్లాలకు వెళ్లిన వారిలో అత్యధికులు తిరిగి వచ్చేయడం ఆశ్చర్యానికి గురిచేసింది. అందులో కొందరికైతే కీలకమైన పోస్టింగ్‌లు దక్కడం కూటమి శ్రేణులను అవాక్కయ్యేలా చేసింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పందిమెట్టలోని టీడీపీ కార్యాలయం వద్ద ఒక సీఐ ప్రవర్తన నేతలు, కార్యకర్తల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉండేది. కార్యాలయం వద్ద ఏ కార్యక్రమం చేపట్టినా సదరు సీఐ..కొంతమంది సిబ్బందిని వెంటబెట్టుకుని వచ్చి హడావిడి చేసేవారు. తనమాట వినకపోతే నేతలు, కార్యకర్తలు అని చూడకుండా లాగి అవతల పడేసేవారు. ఈ క్రమంలో కొంతమంది కార్యకర్తలు కిందపడిపోయిన సందర్భాలు ఉన్నాయి. అలాంటి సీఐకు తిరిగి నగరంలో పోస్టింగ్ దక్కడం టీడీపీలోని కొందరు నేతలతోపాటు కార్యకర్తలను ఆశ్చర్యానికి గురిచేసింది. అలాగే వైసీపీ హయాంలో దాదాపు నాలుగున్నరేళ్లపాటు నగరంలో కీలకమైన పోలీస్ స్టేషన్లలో పనిచేసిన సీఐ ఒకరు ఎన్నికల సమయంలో పొరుగు జిల్లాకు బదిలీ అయ్యారు. సదరు సీఐను ఖాకీ చొక్కా వేసుకున్న వైసీపీ కార్యకర్తగా టీడీపీ, జనసేన కార్యకర్తలు విమర్శించేవారు. అలాంటి సీఐ తిరిగి నగరానికి రావడమే కాకుండా కీలకమైన స్టేషన్‌లో పోస్టింగ్ దక్కించుకోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. వీరిద్దరి వెనుక టీడీపీకి చెందిన సీనియర్ ప్రజా ప్రతినిధి ఒకరు ఉన్నారని, ఆయన సిఫారసు కారణంగానే నగరానికి వచ్చారని అంటున్నారు. అలాగే వైసీపీ హయాంలో నగర పోలీస్ కమిషనరేట్‌లో చక్రం తిప్పడమే కాకుండా, వేరే జిల్లాకు బదిలీ అయితే రెండు రోజుల్లో తిరిగి నగరానికి వచ్చిన సీఐను ఇక్కడే కొనసాగించడాన్ని కూటమి నేతలు తప్పుబడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో పొరుగు జిల్లా ప్రజా ప్రతినిధి అండతో ఏజెన్సీలో మూడున్నరేళ్లపాటు కీలకమైన పోలీస్ స్టేషన్‌లో సీఐగా పనిచేసిన అధికారి, నగరానికి రావడమే కాకుండా సివిల్ సెటిల్‌మెంట్‌లు ఎక్కువగా జరిగే స్టేషన్‌లో పోస్టింగ్ దక్కించుకోవడం చర్చనీయాంశంగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతల అడుగులకు మడుగులొత్తిన అధికారులనే, కూటమి ప్రభుత్వంలోనూ ప్రాధాన్యం కలిగిన పోస్టుల్లో నియమిస్తే వైసీపీ నేతలకు ఇంక అడ్డు ఏముంటుందని ప్రశ్నిస్తున్నారు.

జీవీఎంసీ పోస్టింగ్‌ల్లోనూ గత ప్రభుత్వంలో చక్రంతిప్పిన వారికే అగ్రపీఠం జీవీఎంసీ పరిధిలోని కొందరు జోనల్ కమిషనర్లను ఎన్నికల కమిషన్ నిబంధనలు ప్రకారం బదిలీ చేయాల్సి వచ్చింది. అలాంటి వారిలో కొందరు తిరిగి జీవీఎంసీలో పోస్టింగ్‌లు దక్కించుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ పరిపాలన శాఖలో బదిలీలు చేపట్టగా జీవీఎంసీలో పనిచేస్తున్న ఐదుగురు జోనల్ కమిషనర్లను బదిలీ చేసి వారి స్థానంలో కొత్తగా ఐదుగురికి పోస్టింగ్‌లు ఇచ్చింది. వారిలో నలుగురు ఎన్నికలు ముందువరకూ ఇక్కడ పనిచేసినవారే. వైసీపీ హయాంలో స్పీకర్‌గా వ్యవహరించిన తమ్మినేని సీతారాం పేరు చెప్పుకుని ఒక జోనల్ కమిషనర్ చెలరేగిపోయారు. ఆయన పనిచేసిన జోన్‌లలో తప్పుడు పత్రాలతో వందలాది అసెస్‌మెంట్‌లు జారీచేసి భారీగా జేబులు నింపుకున్నారని ఆరోపణలు ... మిగతా 6వ పేజీలో

సీఐల బదిలీపై కొందరు ఎమ్మెల్యేల్లోనూ అసంతృప్తి - వార్త 6లో

- తెగే దాకా లాగకూడదని మౌనం

భారీగా రైళ్ల రద్దు

- జాబితాలో జన్మభూమి, రత్నాచల్, గోదావరి ఎక్స్‌ప్రెస్, గరీబ్‌రథ్, ఏపీ ఎక్స్‌ప్రెస్, ఉదయ్ ఎక్స్‌ప్రెస్, విశాఖ ఎక్స్‌ప్రెస్, కోరమండల్...
- నేటి నుంచి 7వ తేదీ వరకూ పలు సర్వీస్‌లు క్యాన్సిల్
- బోసిపోయిన స్టేషన్

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీగా కురిసిన వర్షాల కారణంగా అనేక ప్రాంతాల్లో రైల్వే లైన్లు పాడయ్యాయి. విజయవాడ డివిజన్‌లో ముమ్మరంగా జరుగుతున్న రైల్వే లైన్ల అభివృద్ధి పనులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. పలుచోట్ల రైలు పట్టాలపై వరద నీరు ప్రవహించడం, ఇంకొన్ని ట్రాక్‌లు పాడవ్వడంతో విశాఖ నుంచి, విశాఖ మీదుగా వెళ్లే అనేక రైళ్లను వాల్తేరు డివిజన్ అధికారులు రద్దు చేశారు. ఆదివారం నుంచి మొదలైన రైళ్ల రద్దు మంగళవారం కూడా కొనసాగుతుందని రైల్వే వర్గాలు తెలిపాయి.

మంగళవారం విశాఖ-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727), విశాఖ-సికింద్రాబాద్ గరీబ్‌రథ్ (12739), విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ (20708), విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ (20833), విశాఖ-గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22701), విశాఖ-మహబూబనగర్ సూపర్‌ఫాస్ట్ (12861), సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ (20707), సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ (20834), సికింద్రాబాద్-షాలిమార్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (12774), మహబూబ్‌నగర్-విశాఖ సూపర్‌ఫాస్ట్ (12862), తిరుపతి-విశాఖ ప్రత్యేక రైలు (08584), ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-షాలిమార్ కోరమండల్ ఎక్స్‌ప్రెస్ (12842), లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12806), సికింద్రాబాద్-భువనేశ్వర్ విశాఖ ఎక్స్‌ప్రెస్ (17016), హైదరాబాద్-కటక్ ప్రత్యేక రైలు (07165), బెంగళూరు-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12864) రద్దు చేశారు. 4న (బుధవారం) షాలిమార్-సికింద్రాబాద్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (12773), న్యూఢిల్లీ-విశాఖ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20806), ముంబై-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019), తంబరం-సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్ (22842), ఎర్నాకులం-హటియా ధార్తి ఏసీ ఎక్స్‌ప్రెస్ (22838), కటక్-హైదరాబాద్ ప్రత్యేక రైలు (07166), 5న ఎర్నాకులం-టాటానగర్ ఎక్స్‌ప్రెస్ (18189), 6న హౌరా-మైసూరు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22817), కొచువేలి-షాలిమార్ ప్రత్యేక రైలు (06081), 7న కన్యాకుమారి-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12666), తిరువేలి-పురిలియా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22606)లను రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

మళ్లింపు మార్గంలో; మంగళవారం విశాఖ నుంచి న్యూఢిల్లీ వెళ్లే ఏపీ ఎక్స్‌ప్రెస్ (20805) వయా విజయనగరం, రాయగడ, రాయపూర్, నాగపూర్ మీదుగా, హైదరాబాద్ నుంచి విశాఖ వచ్చే గోదావరి ఎక్స్‌ప్రెస్ (12728) వయా పగిడిపల్లి, నల్గొండ, గుంటూరు మీదుగా నడుస్తాయి.

విశాఖ నుంచి వెళ్లే 12 రైళ్లు, విశాఖ మీదుగా వెళ్లే 19 రైళ్లు రద్దయ్యాయి. దాంతో ముందుగానే ప్రయాణాలు పెట్టుకున్నవారు, ఇతర ప్రాంతాల నుంచి విశాఖపట్నం వచ్చి, ఇక్కడి నుంచి గమ్యస్థానాలకు వెళ్లాలనుకున్నవారు ఇబ్బందులు పడుతున్నారు. సమాచారం ముందుగా తెలుసుకున్నవారు ప్రయాణాలు రద్దు చేసుకోవడంతో విశాఖపట్నం రైల్వే స్టేషన్ ఖాళీగా ఉంది. ఏ రైళ్లు రాకపోవడంతో ప్లాట్‌ఫారాలు బోసిపోతున్నాయి. ఇతర రైళ్లలో వచ్చి, మరో రైలు ఎక్కాల్సినవారు ... మిగతా 6వ పేజీలో



హెల్మెట్ లేకుండా వెళ్తున్న ద్విచక్ర వాహనచోదకుడ్ని అడ్డుకుంటున్న ట్రాఫిక్ పోలీసులు

హెల్మెట్‌పై స్పెషల్ డ్రైవ్

నగరంలో విస్తృతంగా తనిఖీలు

- ద్విచక్ర వాహన చోదకుడితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా ధరించాల్సిందే...
- ఇద్దరిలో ఎవరికి లేకపోయినా రూ.1,035 జరిమానా
- డ్రైవింగ్ లైసెన్స్ కూడా మూడు నెలలు సస్పెన్షన్
- రెండు రోజుల్లోనే 1,500 కేసులు నమోదు
- పలుకుబడి ఉన్నవారి జోలికి వెళ్లని పోలీసులు

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో మరణాలను తగ్గించేందుకుగాను ద్విచక్ర వాహన చోదకుడితోపాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేసేందుకు నగర పోలీసులు తనిఖీలు ప్రారంభించారు. సోమవారం తగరపువలస నుంచి వడ్లపూడి వరకూ ట్రాఫిక్, శాంతిభద్రతల విభాగాలకు చెందిన సీఐలు, ఎస్‌ఐల ఆధ్వర్యంలో సిబ్బంది ఎక్కడికక్కడ రోడ్లపై నిలబడి తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనం నడుపుతున్నవారితోపాటు వెనుక కూర్చున్న వ్యక్తి హెల్మెట్ ధరించకపోయినా వారి వాహనాలను ఆపి ఫొటోలు తీసి, మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ వివరాలను కూడా యాప్‌లో అప్‌లోడ్ చేసి రవాణా శాఖ అధికారులకు పంపిస్తున్నారు. వారి లైసెన్స్‌ను మూడు నెలలు సస్పెండ్ చేస్తున్నట్టు అక్కడికక్కడే రశీదును అందజేస్తున్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపినా, వెనుక కూర్చున్న వ్యక్తికి హెల్మెట్ లేకపోయినా రూ.1,035 జరిమానాగా విధిస్తున్నారు. గతంలో రూ.135 జరిమానాగా విధించేవారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల పేరుతో దీనిని 1,035కి పెంచినట్టు పోలీసులు చెబుతున్నారు. స్పెషల్ డ్రైవ్ ప్రారంభించిన ఒకటో తేదీ (ఆదివారం)న 698 కేసులు నమోదుచేసిన పోలీసులు రెండో రోజైన సోమవారం ఏకంగా 800 వరకూ నమోదుచేశారు.

పలుకుబడి ఉన్నవారి జోలికి వెళ్లని పోలీసులు

అయితే హెల్మెట్ ... మిగతా 6వ పేజీలో



హెల్మెట్ ధరించకపోవడంతో వాహనాన్ని అడ్డుకుంటున్న ట్రాఫిక్ పోలీస్

బస్సుల పునరుద్ధరణ

- మాచర్ల మీదుగా హైదరాబాద్‌కు సర్వీస్‌లు



ద్వారకా బస్‌స్టేషన్, సెప్టెంబరు 2: భారీవర్షాల కారణంగా రద్దు చేసిన దూర ప్రాంతాల సర్వీస్‌లన్నింటినీ ఆర్టీసీ విశాఖ రీజియన్ అధికారులు పునరుద్ధరించారు. సోమవారం షెడ్యూల్ సమయానికే బస్సులు బయలుదేరాయి. వర్షాలకు విజయవాడ, గుంటూరు జిల్లాల్లో రహదారులు జలమయం కావడంతో ఆయా ప్రాంతాలకు వెళ్లాల్సిన 14 బస్సులను ఆదివారం రద్దు చేశారు. అలాగే విజయవాడ, ఆపై ప్రాంతాల నుంచి విశాఖ రావలసిన ఆరు బస్సులను కూడా రద్దు చేసేశారు. ఆదివారం రాత్రి నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టడం, రోడ్ల మీద వరద ప్రవాహం కొంత మేర తగ్గడంతో రద్దు చేసిన సర్వీస్‌లను అధికారులు పునరుద్ధరించారు. విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన బస్సును మాచర్ల మీదుగా నడుపుతున్నారు. ఐతవరం-జగ్గయ్యపేట మధ్య వంతెన దెబ్బతినడంతో ప్రయాణికుల భద్రత దృష్ట్యా మాచర్ల మీదుగా హైదరాబాద్ బస్సులు నడుపుతున్నట్టు అధికారులు తెలియజేశారు.

విమాన టికెట్ల ధరలకు రెక్కలు

- హైదరాబాద్‌కు రూ.6,500
- రైళ్ల రద్దుతో డిమాండ్ పెరగడమే కారణం



విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వరదల కారణంగా విజయవాడ మీదుగా హైదరాబాద్ వెళ్లే రైళ్లు రద్దయిన సంగతి తెలిసిందే. దీంతో అత్యవసరంగా హైదరాబాద్ వెళ్లాల్సినవారు విమానాలను ఆశ్రయిస్తున్నారు. బస్సు సర్వీసులు ... మిగతా 6వ పేజీలో

ఉక్కులో వీఆర్‌ఎస్

- ఉద్యోగులు, కార్మికుల సంఖ్య కుదింపునకు యత్నం
- ప్రస్తుతం ప్లాంటులో 12 వేల మంది ఉద్యోగులు
- వచ్చే మార్చి 31 నాటికి మూడో వంతు తగ్గించాలని లక్ష్యం
- అందుకోసం రూ.1,250 కోట్లు కేటాయింపు
- కాంట్రాక్టు కార్మికులను కూడా 33 శాతం మేర తగ్గించాలని ఆదేశాలు
- కేంద్రం తీరుపై భగ్గుమంటున్న కార్మికులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో ఉత్పత్తి మెరుగుదలకు ఎటువంటి చర్యలు చేపట్టని యాజమాన్యం ఉద్యోగులు, కార్మికుల సంఖ్య కుదింపునకు మాత్రం పక్కా ప్రణాళిక సిద్ధం చేసింది. ఇప్పుడున్న ఉద్యోగుల్లో మూడో వంతు మందిని 2025 మార్చి నాటికి తగ్గించాలని కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ఆదేశించింది. దానికి అనుగుణంగా యాజమాన్యం రకరకాల పేర్లతో ఇప్పటినుంచే సిబ్బందిని తగ్గించే ప్రయత్నం చేస్తోంది.

స్టీల్ ప్లాంటు వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ఏడాదికి 70 లక్షల టన్నులు. దీనికి 15 వేల మంది





మాట్లాడుతున్న నరసింగరావు

రెగ్యులర్ సిబ్బంది (అధికారులు, కార్మికులు) అవసరం.కానీ ఇప్పుడు 12 వేల మంది మాత్రమే ఉన్నారు. వారి సంఖ్య కూడా మార్చి 31 నాటికి 9,500కి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా కొందరిని ఇతర ప్లాంట్లకు డిప్యుటేషన్‌పై పంపడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మరికొందరిని స్వచ్ఛంద పదవీ విరమణ పథకం (వీఆర్‌ఎస్) కింద పంపించేయాలని ప్లాన్ చేశారు. దీనికి కేంద్ర ప్రభుత్వం రూ.1,250 కోట్లు కేటాయించింది. ముడి పదార్థాల కొనుగోలుకు నిధులు లేవని, నిర్వహణ మూలధనం సర్దుబాటు చేయాలని ఉద్యోగ, కార్మిక సంఘాలు కొన్ని నెలలుగా డిమాండ్ చేస్తుంటే పట్టించుకోని ప్రభుత్వం వీఆర్‌ఎస్‌కు మాత్రం నిధులు కేటాయించింది.

ఇక కాంట్రాక్టు కార్మికుల విషయానికి వస్తే వారు ప్రస్తుతం 12 వేల మంది ఉన్నారు. వారిని 33 శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికోసం కొన్ని విభాగాల్లో రోజు తప్పించి రోజు విధులకు రావాలని ... మిగతా 6వ పేజీలో

స్టీల్‌ప్లాంటును బతికించాలంటూ 10న రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నరసింగరావు

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంటును బతికించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ ఈనెల పదో తేదీన రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు నిర్వహించనున్నట్టు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్, సీఐటీయూ నాయకుడు సీహెచ్ నరసింగరావు తెలిపారు. జగదాంబ జంక్షన్‌లోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు వైసీపీ ప్రభుత్వం నిజాయితీగా పనిచేయలేదని విమర్శించారు. దీనివల్ల కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిని 73 లక్షల టన్నుల నుంచి 45 లక్షల టన్నులకు తగ్గించిందన్నారు. ఐదు వేల మందికిపైగా కాంట్రాక్టు కార్మికులను తొలగించిందన్నారు. అదేవిధంగా ఐదు వేల మంది ఉద్యోగులను వీఆర్‌ఎస్ ద్వారా తగ్గించగా, మరో 1,500 మందిని బయటకు పంపించేందుకు రూ.1261 కోట్లు కేటాయించిందన్నారు. స్టీల్‌ప్లాంటుకు అవసరమైన ముడిసరకు కొనడానికి డబ్బుల్లేవని చెబుతున్న యాజమాన్యానికి...ఉద్యోగులను వీఆర్‌ఎస్ కింద బయటకు పంపించడానికి డబ్బులు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. రాష్ట్రంలోని పరిశ్రమలకు మణిహారంగా ఉన్న స్టీల్‌ప్లాంటును కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. స్టీల్‌ప్లాంటు పరిరక్షణ కోసం ఈనెల పదో తేదీ ఉదయం పది గంటల నుంచి 11 గంటల వరకూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే రాస్తారోకోలో కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు భాగస్వామ్యులవ్వడం ద్వారా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని విజ్ఞప్తి చేశారు.

జడ్పీ సీఈవో పోస్టుకు పోటీ

పలువురికి ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలు

- నేతల మధ్య అంతరం
- మంత్రి లోకేశ్ దృష్టికి వ్యవహారం
- కీలక మండలాల ఎంపీడీవో పోస్టులకూ డిమాండ్
- ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తున్న వైనం



విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) పోస్టుకు పలువురు అధికారులు పోటీపడుతున్నారు. ఇప్పటికే ప్రజా ప్రతినిధులు కొందరి అధికారుల పేర్లను సిఫారసు చేస్తూ లేఖలు ఇచ్చారు. ప్రస్తుత సీఈవో పోలినాయుడు వ్యవసాయశాఖా మంత్రి అచ్చెన్నాయుడుకు ఓఎస్‌డీగా వెళ్లడంతో డిప్యూటీ సీఈవో సత్యనారాయణకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ దశలో సీఈవోగా వచ్చేందుకు 1999, 2007 బ్యాచ్‌కు చెందిన ఎంపీడీవోలు పోటీ పడుతున్నారు.

జడ్పీ సీఈవో పోస్టు కోసం ఉమ్మడి జిల్లాలో పలువురు ప్రజా ప్రతినిధులు సిఫారసు లేఖలు ఇచ్చారు. గత ప్రభుత్వంలో ఏపీఐఐసీలో పనిచేసి, ఆరోపణలు ఎదుర్కొన్న అధికారిని గ్రామీణ ప్రాంతానికి చెందిన కీలక ప్రజా ప్రతినిధి సిఫారసు చేయడం దుమారం రేపుతోంది. దీనిపై నాలుగు రోజుల క్రితం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి నారా లోకేశ్ కు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఫిర్యాదు చేశారు. గ్రామీణ ప్రాంతంలో ప్రజా ప్రతినిధులంతా ఒక మాట అనుకుని, సమర్థుడైన అధికారిని సిఫారసు చేస్తే వివాదం ఉండేది కాదు. అలాకాకుండా దాదాపు ముగ్గురి నుంచి నలుగురికి ప్రజా ప్రతినిధులు సిఫారసు లేఖలు ఇచ్చారు. ఏం జరుగుతుందో చూడాలి. సీఈవో పోస్టు ... మిగతా 6వ పేజీలో

కనకమహాలక్ష్మికి శ్రావణ పూజలు



జగదాంబ కూడలి, సెప్టెంబరు 2: వన్‌టౌన్ కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసోత్సవ పూజలు 29వ రోజుకు చేరాయి. సోమవారం ఆలయంలో విశిష్ట పూజలను నిర్వహించారు. పండితుల ఆధ్వర్యంలో హోమం, కుంకుమ పూజలు చేశారు. శ్రావణలక్ష్మిగా అమ్మవారిని అలంకరించారు. జేఈవో వి.రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి



సంఘటన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కేకే రాజు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 2: గ్రేటర్ 26వ వార్డులోని వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఉత్తర వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు డిమాండ్ చేశారు. ఆ ప్రాంతాన్ని సోమవారం సందర్శించి దుండగులను పట్టుకొని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, అల్లు శంకరరావు, కె.అనిల్‌కుమార్‌రాజు, రెయ్యి వెంకటరమణ, వావిలపల్లి ప్రసాద్, పద్మారెడ్డి, పీలా వెంకటలక్ష్మి ఉన్నారు.

తెలుగు ఉపాధ్యాయుడికి సత్కారం

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 2: ఎన్‌జీజీఓస్ కాలనీలో ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎంవీ ధర్మారావును మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థ ప్రిన్సిపాల్ చల్లా అంజిరెడ్డి సోమవారం సత్కరించారు. హెచ్‌ఎం బి.లక్ష్మీ నరస, సహోపాధ్యాయులు అభినందించారు.

సీతమ్మధార రైతుబజార్‌లో కలకలం

- ఆక్సిజన్ టవర్స్ పైనుంచి మందుసీసాలు, పెయింటింగ్ సీసాలు విసిరేసిన వైనం
- టవర్స్ వద్ద ఆందోళనకు దిగిన రైతులు



రైతుబజార్‌లో పడిన సీసాలు, రాళ్లు, ఇతర సామగ్రి

సీతమ్మధార, సెప్టెంబరు 2: నగరంలోని అతిపెద్ద సీతమ్మధార రైతుబజార్‌లో కలకలం రేగింది. దీనికి ఆనుకుని ఉన్న ఆక్సిజన్ టవర్స్ అపార్టుమెంట్ పైనుంచి రైతుబజార్‌లోకి అప్పుడప్పుడు సీసాలు, రాళ్లు పడుతున్నాయి. పెద్ద శబ్దం రావడంతో రైతులు, కొనుగోలుదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఆదివారం సాయంత్రం రైతుబజార్ రద్దీగా ఉంది. అదే సమయంలో పెద్ద సంఖ్యలో సీసాలు, ఇతర సామగ్రితో పాటు ఓ రాయి బజార్ మధ్యలో పడ్డాయి. ఓ కొనుగోలుదారుడు గాయపడ్డాడు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్టేట్ అధికారి కొండబాబుతో కలిసి ఆక్సిజన్ టవర్స్ సెక్యూరిటీ గేటు వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. రైతుబజారులో బీరు బాటిళ్లు, మంచినీటి సీసాలు, రాళ్లు పడుతున్నాయని తెలిపారు. దీంతో అపార్టుమెంట్ వాసులు సర్దిచెప్పి పంపివేశారు. దీనిని నగర పోలీసు కమిషనర్ దృష్టికి కొంతమంది తీసుకువెళ్లడన విచారణకు ఆదేశించారు. దీంతో సోమవారం ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి ఆక్సిజన్ టవర్స్ అపార్టుమెంట్ వాసులతో సమావేశం ఏర్పాటు చేసి ఇకపై ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఆక్సిజన్ టవర్స్ వద్ద ఆందోళనకు దిగిన రైతులు

మెరుగైన వైద్య సేవలందించాలి

సీతమ్మధార, సెప్టెంబరు 2: బానోజీ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సోమవారం పరిశీలించారు. అడల్ట్ బీసీడీ వాక్సిన్, ఈహెచ్‌ఆర్, ఓపీ, ల్యాబ్ సేవల వివరాలు తెలుసుకున్నారు. సిబ్బందికి సూచనలిచ్చారు.

హెల్మెట్ ధారణపై ప్రత్యేక డ్రైవ్

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 2: ద్విచక్ర వాహనాలు నడిపే వారంతా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ ఎస్‌ఐ వి.వాణిశ్రీ తెలిపారు. అక్కయ్యపాలెం సిగ్నల్ పాయింట్ వద్ద సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.



32వ వార్డులో అన్నదానం ప్రారంభిస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



బీజేపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

జగదాంబ కూడలి, సెప్టెంబరు 2: జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా వన్‌టౌన్ పరిధిలో ఆ పార్టీ నేతలు అన్నసమారాధ నిర్వహించారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పలుచోట్ల జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 33వ వార్డు కార్పొరేటర్ గోడి విజయలక్ష్మి, గోడి నరసింహాచారి ఆధ్వర్యంలో అన్నవితరణ చేశారు. 37వ వార్డులో గరిగిన రవికుమార్, అరుణ్ నేతృత్వంలో కేక్ కత్తిరించి వేడుకలు జరిపారు.

డాబాగార్డెన్స్: రాష్ట్రాభివృద్ధిలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మరిన్ని సేవలు అందించాలని 31వ వార్డు నేతలు అభిలషించారు. పవన్ జన్మదిన వేడుకలను సోమవారం గొల్లలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో కొల్లూరు రూప ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి పిల్లలకు పుస్తకాలు, పెన్సిల్స్, పెన్నులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. మొకర గోపి, పల్లా చందు, బమ్మిడి ఎల్లాజీ, కండేపల్లి శ్రీధర్, ఎస్.రాజేంద్ర, వెంకటేష్, టి.వరలక్ష్మి పాల్గొన్నారు.

కంచరపాలెం: పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను 47వ వార్డులో నిర్వహించారు. కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి ఆధ్వర్యంలో కప్పరాడలో వేడుకలకు ఉత్తర జనసేన నేత పసుపులేటి ఉషాకిరణ్ హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు పండ్లు, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫణి, సురేష్, చిన్న, నాని, రఫీ పాల్గొన్నారు.

జ్ఞానాపురం: గ్రేటర్ 32వ వార్డులో జనసేన నేతలు, కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో పవన్ జన్మదిన వేడుకలు జరిగాయి. ఓమ్నీ, వాసన్ ఐకేర్, సియాన్ కేన్సర్ క్లినిక్, వి డెంటల్ ఆస్పత్రుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీవీ రామ్,బద్రీనాథ్, కేదార్‌నాథ్ పాల్గొన్నారు.

సీతమ్మధార: సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో గల బిజెపి పార్టీ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే, బిజెపి ఫ్లోర్ లీడర్ పి.విష్ణుకుమార్ రాజు కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన జనసేన నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్‌ను సాలువతో సత్కారించారు. ఈ కార్యక్రంలో బిజెపి నాయకురాలు శ్యామలదీపిక, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా 24వ వార్డు జనసేన పార్టీ వార్డు అధ్యక్షురాలు అడబాల లక్ష్మి ఆధ్వర్యంలో పవన్ జన్మదినం సందర్భంగా జీవీఎంసీ శానిటేషన్ సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. ఉత్తర ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ గురుమూర్తి రెడ్డి, కమిటీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎర్రాజీ జ్యోతికి నేవీ అధికారుల అభినందనలు



నేవల్ కమాండింగ్ ఆఫీసర్ రాజత్ నగ్పాల్, తదితరులతో జ్యోతి

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 2: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న ఎర్రాజీ జ్యోతిని ఐఎన్ఎస్ కళింగ నేవల్ కమాండ్ అధికారులు సోమవారం అభినందించారు. ఐఎన్ఎస్ శాతవాహన ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి కమాండింగ్ ఆఫీసర్ కమాండర్ రాజత్ నగ్పాల్ హాజరై జ్యోతికి మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒలింపిక్ గేమ్స్ మహిళల 100మీ. హర్డిల్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించిన తొలి మహిళా అథ్లెట్‌గా ఎర్రాజీ జ్యోతి రికార్డు నెలకొల్పిందన్నారు. కెరీర్‌లో 100మీ. రేస్‌లో అత్యుత్తమ టైమింగ్ (11.47) నెలకొల్పిన జ్యోతి...100మీ. హర్డిల్స్‌లో 12.78 సెకన్ల టైమింగ్‌తో జాతీయ రికార్డు సృష్టించడం విశేషమన్నారు. 2028 లాస్ ఏంజెల్స్‌లో జరిగే ఒలింపిక్స్‌లో దేశానికి పతకం అందించాలని ఆకాంక్షించారు. అనంతరం జ్యోతి ఒలింపిక్స్‌లో తన అనుభవాలను వివరించి, నేవల్ అధికారులు, సిబ్బంది అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చింది. ఈ కార్యక్రమంలో నేవల్ కమాండ్ అధికారులు, సిబ్బంది, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రతినిధులు డి.నాగేశ్వరరావు, ఎం.నారాయణరావు, ఎంవీ.పవన్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌కు నేతల ఘన నివాళి

సీతమ్మధార, సెప్టెంబరు 2: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయనకు వైసీపీ నేతలు సోమవారం ఘన నివాళి అర్పించారు. 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మరెడ్డి ఆధ్వర్యంలో నక్కవానిపాలెం ఇందిరాగాంధీ పార్కులో గల వైఎస్ విగ్రహం వద్ద పార్టీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, అల్లు శంకరరావు, కె.అనిల్ కుమార్‌రాజు, వావిలపల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మురళీనగర్: గ్రేటరు 51వవార్డు వైసీపీ కార్యాలయంలో కార్మికులకు పండ్లు పంపిణీ చేశారు. వైఎస్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వార్డు నాయకులు, మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

'దేశ ప్రగతిలో భాష, సాహిత్యానికి కీలక పాత్ర'

సీతంపేట, సెప్టెంబరు 2: దేశాభివృద్ధికి, ప్రగతికి భాష, సాహిత్య రంగాలు కీలక పాత్ర పోషిస్తాయని భాషావేత్త డాక్టర్ సుసర్ల శారదా పూర్ణ తెలిపారు. తెలుగు సంస్కృత భాషల్లో విస్తృత పరిశోధన చేసి, విదేశాల్లో అవగాహనా కల్పిస్తున్న ఆమెకు బరంపురం విశ్వవిద్యాలయం డిలిట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా విశాఖ సాహితీ సంస్థ పౌరగ్రంథాలయంలో అభినందన సభ నిర్వహించింది. సంస్థ ఉపాధ్యక్షులు డాక్టర్ కందాళ కనకమహాలక్ష్మి, కార్యదర్శి శంకర్ నీలు భాగవతులు, తదితరులు సత్కరించారు. సుసర్ల రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

వరద బాధితులకు 1.5 లక్షల ఆహార ప్యాకెట్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరదలకు చిక్కుకున్న విజయవాడ ప్రజలకు 1.5 లక్షల ఆహార ప్యాకెట్లు సరఫరా చేసేందుకు కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా పౌరసరఫరాల అధికారి జి.సూర్యప్రకాశరావు సిబ్బందితో కలిసి ఆహారం తయారీలో నిమగ్నమయ్యారు. మంగళవారం ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనాల కోసం మూడు రకాల ఆహార పదార్థాలు సిదం చేశారు. టిఫిన్, పులిహోర, వెజ్ బిర్యానీ ప్యాకెట్లను సింహాచలం దేవస్థానం, అక్షయపాత్రతోపాటు మరికొన్ని ప్రైవేటు కేటరింగ్ సంస్థలు సిద్ధం చేశాయి. వీటిని సోమవారం రాత్రి ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లో తరలించేందుకు రైల్వేశాఖ ఒక బోగీ కేటాయించింది.

ట్రెజరీ కార్యాలయం పైకప్పు నుంచి ఊడిపడిన పెచ్చులు

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ పైఅంతస్తులో ఉన్న జిల్లా ఖజానా కార్యాలయం పైకప్పు నుంచి పెచ్చులు సోమవారం ఊడిపడ్డాయి. డిప్యూటీ డైరెక్టర్ చాంబర్‌కు తూర్పువైపుగా పడడంతో పెద్ద శబ్దం వచ్చింది.. అక్కడ సిబ్బంది లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కార్యాలయం పైకప్పు శిథిలావస్థకు చేరి వర్షం వచ్చినప్పుడల్లా సిబ్బంది వేరొచోట విధులు నిర్వహిస్తుంటారు. వరుసగా మూడు రోజులు కురిసిన వర్షాలకు కార్యాలయం పైకప్పు తడిసిపోయి పెచ్చులు ఊడి పడుతున్నాయి.

నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న అతిథులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 2: పోర్టు ఆస్పత్రి ఎదురుగా 'ఆంధ్రజ్యోతి' కార్యాలయం పక్కన ఉన్న లక్ష్మీ వినాయక ఆలయ సన్నిధానంలో వినాయక నవరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. శ్రీగురుపాద సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహోత్సవాల ఆహ్వాన పత్రికను శైవ ఆగమ పండితులు శివశ్రీ బాలానంద శివాచార్య సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు ప్రతి రోజూ ఆలయంలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అభిషేకాలు, అర్చనలు మహిళలతో పారాయణలు, దివ్య హారతి, అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. తిరిగి సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు అర్చన, షోడచోపచార హారతులు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు ఎంవీఆర్ మూర్తి, పీవీజీ రావు, ఆర్‌వీఆర్ మూర్తి, ఆర్.శ్రీధర్, ఎంవీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఐల బదిలీలపై కొందరు ఎమ్మెల్యేల్లోనూ అసంతృప్తి

- తెగే దాకా లాగకూడదని మౌనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ నగర పరిధిలో జరిగిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలపై కూటమి ఎమ్మెల్యేలు కొందరిలో అసంతృప్తి ఇంకా చల్లారలేదు. సమస్యను తెగేంత వరకు లాగకూడదని కొందరు మౌనం వహిస్తున్నట్టు తెలిసింది. జిల్లాలో ఒకరిద్దరు ఎమ్మెల్యేలు చేసిన సిఫారసులు తప్పితే మిగిలినవారు ఇచ్చిన పేర్లను పోలీస్ అధికారులు పట్టించుకోలేదని తెలుస్తోంది. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు నియోజకవర్గ పరిధిలో మూడు స్టేషన్లున్నాయి. ముగ్గురి పేర్లను ఆయన సూచించినట్టు సమాచారం. అందులో ఒక అధికారిపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని, పోలీస్ పెద్దల నుంచి సమాచారం వచ్చినట్టు తెలిసింది. మిగిలిన రెండు స్టేషన్లకు కూడా ఆయన సూచించిన వారిని కాకుండా వేరే వారిని వేశారు. దాంతో ఆయన వ్యక్తిగత భద్రతకు ప్రభుత్వం కేటాయించిన గన్‌మెన్‌ను ఆదివారం ఉదయం పంపించేశారు. సాయంత్రానికి తేరుకొని వెనక్కి తెచ్చుకున్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు అని పలువురు పెద్దలు సూచించడంతో మనసు మార్చుకున్నట్టు తెలిసింది. సీనియర్ ఎమ్మెల్యేల సిఫారసులను కూడా బుట్టదాఖలు చేయడంతో వారు కూడా రగిలిపోతున్నారు. అధికార పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలు సూచించిన పేర్లను బదిలీల సమయంలో పట్టించుకోకపోవడం ఇదే మొదటిసారని ఆరోపిస్తున్నారు.

జడ్పీ సీఈవో పోస్టుకు పోటీ

... 5వ పేజీ తరువాయి

వ్యవహారం ప్రజా ప్రతినిధుల మధ్య అంతరం పెంచిందని టీడీపీ వర్గాల అభిప్రాయం.

ఎంపీడీవో పోస్టులకూ పోటీ..

ఉమ్మడి జిల్లాలో 39 మండలాలు ఉండగా పెందుర్తి, దేవరాపల్లి, కె.కోటపాడు, వి.మాడుగుల, మాకవరపాలెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాయకరావుపేట, చోడవరం, చీడికాడ, గొలుగొండ, నర్సీపట్నం, రోలుగుంట, సబ్బవరం, ఆనందపురం ఎంపీడీవోలు ఒకేచోట ఐదేళ్లు అంతకంటే ఎక్కువ సర్వీసు పూర్తిచేసుకున్నారు. ఖాళీగా ఉన్న ఐదు మండలాలకు ఎంపీడీవోలను నియమించాల్సి ఉంది. ఒకేచోట ఐదేళ్లకు పైగా పనిచేసిన అధికారులకు బదిలీ చేయాలని గత నెలలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో స్పష్టంచేస్తోంది. ఇంకా బదిలీలకు జీరో సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. దీని ప్రకారం పాయకరావుపేట, చోడవరం, చీడికాడ, గొలుగొండ, నర్సీపట్నం, రోలుగుంట, సబ్బవరం, ఆనందపురం తదితర ఎనిమిది మండలాల ఎంపీడీవోలు విధిగా బదిలీ కావాల్సిందే. ఐదేళ్ల కంటే తక్కువ సర్వీసున్న 12 మంది ఎంపీడీవోలు, అంతర్ జిల్లాల బదిలీల్లో భాగంగా ఉమ్మడి జిల్లాకు రావాలని తొమ్మిది మంది ఎంపీడీవోలు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎక్కువ మండలాల్లో ఎంపీడీవోలకు స్థానచలనం ఉంటుందని, అందుకు తగినట్టుగానే పలువురు ప్రజా ప్రతినిధుల నుంచి సిఫారసు లేఖలు తీసుకున్నారని సమా చారం. గత ప్రభుత్వంలో కీలక మండలాల్లో పనిచేసిన ఎంపీడీవోలు అప్పటి వైసీపీ నాయకులతో అంటకాగారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు వారంతా కూటమి నేతల చుట్టు తిరుగుతూ తామంతా అనుకూలంగా పనిచేస్తామని నమ్మబలుకుతున్నారు. నగర పరిసరాలు, మైదానంలో జాతీయ రహదారికి ఆనుకుని మండలాల్లో ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారిని విధిగా ఏజెన్సీకి బదిలీ చేయాలని, అక్కడి ఎంపీడీవోలు కోరుతున్నారు. దీంతో వారికి మైదానంలో అవకాశం దొరుకుతుందని అభిప్రాయపడుతున్నారు.

మహిళ పొట్టలో ఎముకల గూడు

- శస్త్రచికిత్స చేసి తొలగించిన కేజీహెచ్ వైద్యులు



తొలగించిన ఎముకల గూడు

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కింగ్ జార్జ్ ఆస్పత్రిలోని గైనకాలజీ విభాగానికి చెందిన వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను నిర్వహించారు. మహిళ పొట్టలో పేగులు చుట్టూ ఏర్పడిన ఎముకల గూడును శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. ఈ తరహా కేసులు ఇప్పటివరకూ దేశంలో 25 వరకు మాత్రమే నమోదయ్యాయని, విశాఖలో తొలిసారి ఇటువంటి శస్త్రచికిత్సను నిర్వహించినట్టు వైద్యులు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లాకు చెందిన 27 ఏళ్ల మహిళ గతంలో ఇద్దరికి జన్మనిచ్చింది. మూడేళ్ల కిందట మరోసారి గర్భం దాల్చింది. పిల్లలు వద్దనుకున్న ఆమె అబార్షన్ నిమిత్తం మందులు వినియోగించారు. అబార్షన్ అయినట్టు ఆమెకు వైద్యులు చెప్పారు. అయితే, అప్పటి నుంచి సదరు మహిళ తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ వస్తోంది. ఎంతమంది వైద్యులకు చూపించినా పరిష్కారం లభించలేదు. కొద్దిరోజుల కిందట కేజీహెచ్‌కు వచ్చిన ఆమెకు వైద్యులు అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయించారు. ఈ స్కానింగ్‌లో కడుపులో కణితిని గుర్తించారు. పూర్తిస్థాయిలో స్పష్టత కోసం ఎంఆర్ఐ స్కానింగ్ చేయించగా, 24 వారాలు శిశువుకు సంబంధించిన ఎముకల గూడు ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. దీనినే వైద్య పరిభాషలో లిథోపెడియన్ (శిశువు ఎముకలగూడు)గా పేర్కొంటారని కేజీహెచ్ గైనిక్ విభాగం మూడో యూనిట్ ప్రొఫెసర్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. ఈ నేపథ్యంలో ఐ.వాణి, ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఆనంద్ సహకారంతో శస్త్ర చికిత్స నిర్వహించారు. శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన వైద్యులను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద అభినందించారు. ఆమె ఆరోగ్యంగా ఉందని, కోలుకుందని డాక్టర్ ఐ.వాణి తెలిపారు. మంగళవారం డిశ్చార్జ్ ఇస్తామన్నారు. అత్యంత అరుదుగా ఇటువంటి కేసులను చూస్తుంటామన్నారు.

అప్పుడూ వారే... ఇప్పుడూ వారే!!

... 5వ పేజీ తరువాయి

వెల్లువెత్తాయి. దీనిపై అప్పటి కమిషనర్లు విచారణకు ఆదేశించారు. తనకున్న రాజకీయపలుకుబడితో విచారణ నుంచి బయటపడ్డారని జీవీఎంసీ అధికారులు చెబుతుంటారు. అంతేకాకుండా ఒక పరిశ్రమ సీఎస్ఆర్ కింద మంజూరుచేసిన నిధులను జోనల్ కమిషనర్ ఖాతాకు కాకుండా తన వ్యక్తిగత ఖాతాలో వేయించుకున్నారని ఆరోపణలు వచ్చాయి. అదే సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆ అంశం మరుగునపడిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నగరంలోని ఒక కీలక ప్రజా ప్రతినిధిని ప్రసన్నం చేసుకుని తిరిగి కీలకమైన జోన్‌కు కమిషనర్‌గా పోస్టింగ్ తెచ్చుకున్నారు. సదరు అధికారికి ఆ జోనల్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇవ్వొద్దని ఆ ప్రాంత కార్పొరేటర్లు సంబంధిత ప్రజా ప్రతినిధికి స్పష్టం చేశారు. అయినప్పటికీ పట్టించుకోకుండా సిఫారసు లేఖ ఇచ్చారని కార్పొరేటర్లే ఆరోపిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఇంకో జోన్‌కు కమిషనర్‌గా పోస్టింగ్ దక్కించుకున్న అధికారి కూడా ఎన్నికలకు ముందు వరకూ వైసీపీ కార్యకర్త మాదిరిగా వ్యవహరించారని కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో పొరుగు జిల్లాకు బదిలీపై వెళ్లినప్పటికీ కూటమి అధికారంలోకి రాగానే తన సామాజిక వర్గానికి చెందిన పొరుగు జిల్లా నేతను పట్టుకుని కీలకమైన జోన్‌లో పోస్టింగ్ దక్కించుకున్నారు. తాజా పోస్టింగ్‌లలో మరో కీలకమైన జోన్‌కు కమిషనర్‌గా వచ్చిన అధికారి కూడా వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు ముఖ్యమైన జోన్‌లకు కమిషనర్‌గా పనిచేశారని ఎన్నికల సమయంలో పొరుగు జిల్లా మునిసిపాలిటీకి కమిషనర్‌గా వెళ్లినప్పటికీ కూటమి అధికారంలోకి రాగానే తిరిగి నగరానికి చేరిపోయారని విమర్శిస్తున్నారు. కూటమిలోని కొంతమంది ప్రజా ప్రతినిధులకు పార్టీల ప్రయోజనాల కంటే వారి వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యమైపోయాయని, అందువల్లే వారిని ప్రసన్నం చేసుకుంటే గతంలో చేసిన తప్పులన్నీ ఒప్పులైపోయినట్టు భావించి సిఫారసు లేఖలు ఇస్తున్నారని కార్యకర్తలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

భారీగా రైళ్ల రద్దు

... 5వ పేజీ తరువాయి

గత్యంతరం లేక ప్లాట్‌ఫారంపై కూర్చొని కాలక్షేపం చేస్తున్నారు.

నేడు విశాఖ నుంచి విజయవాడకు ప్రత్యేక రైలు

పలు రైళ్లు రద్దు అయిన నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం మంగళవారం విశాఖ నుంచి విజయవాడకు (ఒక వైపు) ప్రత్యేక రైలును అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 08581 నంబర్‌తో ఈ రైలు మధ్యాహ్నం 12.55 గంటలకు విశాఖలో బయలుదేరి రాత్రి 7.15 గంటలకు విజయవాడ చేరుతుందన్నారు. రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ నడిచే సమయంలో బయలుదేరే ఈ ప్రత్యేక రైలు 16 సెకండ్ క్లాస్ సిట్టింగ్, రెండు జనరల్ సెకండ్ క్లాస్, రెండు ఏసీ చైర్ కార్, రెండు సెకండ్ క్లాస్ కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లతో నడుస్తుందన్నారు.

హెల్మెట్‌పై స్పెషల్ డ్రైవ్

... 5వ పేజీ తరువాయి

లేకుండా ద్విచక్ర వాహనం నడిపేవారెవరైనా సరే...కేసు నమోదుచేయాల్సిన పోలీసులు కొంతమందిని చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. తమ (పోలీస్) శాఖ సిబ్బందిని, న్యాయవాదులను, రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నవారినీ హెల్మెట్ లేకపోయినా ఆపడం లేదు. కొంతమందిని ఆపినా...తాము ఫలానా అని చెబితే పంపించేస్తున్నారు. అదే ఇతరులెవరైనా హెల్మెట్ లేకుండా వాహనంపై వస్తుంటే అంత దూరం నుంచే ఆపడానికి సిద్ధమైపోతున్నారు. జంక్షన్ వద్దకు రాగానే బైక్ తాళం తీసేసుకుని పక్కకు రమ్మని ఆదేశించి ఫొటోలు తీసి, కేసు నమోదుచేసి పంపిస్తున్నారు. ఈ విషయంలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉక్కులో వీఆర్‌ఎస్

... 5వ పేజీ తరువాయి

ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. మరికొన్ని విభాగాల్లో వారానికి ఐదు రోజులే పనిచేయాలని, నెలకు 20 రోజులకు మించి చేయడానికి వీల్లేదని ఆంక్షలు పెట్టారు. పరోక్షంగా పని దినాలు తగ్గించేస్తున్నారు.

ఉత్పత్తికి విఘాతం

ప్లాంటులో మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా 2021-22 ఆర్థిక సంవత్సరంలో రోజుకు 21 వేల టన్నుల ఉత్పత్తి తీసేవారు. ఆ తరువాత సామర్థ్యం మరింత పెరిగింది. అయితే వీటికి అవసరమైన ముడిపదార్థాలు సరఫరా చేయలేక ప్రస్తుత యాజమాన్యం రెండు బ్లాస్ ఫర్నేస్‌లు మూసేసి ఒకటి మాత్రమే నడుపుతోంది. దాంతో ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. వ్యయం పెరిగి, ఆదాయం తగ్గడంతో నష్టాలు వస్తున్నాయి. దాంతో ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవాలని మంత్రిత్వ శాఖ ఒత్తిడి పెడుతోంది. వాస్తవానికి ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపడానికి అవసరమైనవి సమకూర్చాల్సిన ప్రభుత్వం దానిని వదిలేసి ఉద్యోగుల సంఖ్య కోతపై దృష్టి పెట్టింది. విశాఖ స్టీల్ ప్లాంటును ఆదుకుంటామని ఇక్కడికి వచ్చి మరీ చెప్పిన కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి హామీ 45 రోజులు దాటిని అమలు కాలేదు.

విమాన టికెట్ల ధరలకు రెక్కలు

... 5వ పేజీ తరువాయి

కూడా నిలిచిపోవడంతో గత్యంతరం లేక రేటు ఎక్కువైనా విమానంలో వెళ్లాలని యత్నిస్తున్నారు. దాంతో రేట్లు 50 శాతం పెరిగిపోయాయి. సాధారణంగా హైదరాబాద్ వారం, పది రోజుల ముందు టికెట్ బుక్ చేసుకుంటే రూ.4 వేలకు లభిస్తుంది. అదే ఒకటి, రెండు రోజుల ముందు అయితే ఇంకో వేయి రూపాయలు పెరుగుతుంది. ఇప్పుడు రైళ్ల రద్దు ప్రభావంతో ఒక్కో టికెట్ రూ.6,500 పైనే విక్రయిస్తున్నారు. ఇంటర్వ్యూలకు హాజరు కావలసినవారు, విదేశాలకు కనెక్టింగ్ విమానాలు అందుకోవలసినవారు తప్పనిసరై ఆ రేటుకు టికెట్ కొని వెళుతున్నారు. అదృష్టవశాత్తూ విమాన సర్వీసులకు ఆటంకం లేకపోవడం విశేషం.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఘన నివాళి



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా తీరంలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేయర్ హరికుమారి, తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు సింగిల్ విండో అనుమతులు: సీపీ

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 2: వినాయక ఉత్సవాల నిర్వహణకు సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు పొందవచ్చునని నగర పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిర్వాహకులు గణేష్‌ఉత్సవ్.నెట్ అనే వెబ్‌సైట్‌లో గణేష్ మండపం ఏర్పాటు చేయదలచిన కమిటీ సభ్యులు వివరాలు, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ట జరిగే రోజు, ఏ వాహనంలో నిమజ్జనం చేస్తారు వంటి వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు ఆధ్వర్యంలో పురపాలక, అగ్నిమాపక, విద్యుత్ సిబ్బంది మండపం ఏర్పాటు చేసే ప్రదేశాన్ని సందర్శించి సానుకూలంగా ఉంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రం జారీ చేస్తారన్నారు. అనంతరం ఎస్‌హెచ్‌ఓ వాటిని పరిశీలించి ఎన్‌ఓసీ జారీ చేస్తారన్నారు. ఎన్‌ఓసీ ప్రింట్ తీసి గణేష్ మండపంలో ఉంచాలన్నారు. నిర్వాహకుల్లో ముగ్గురు కంటే ఎక్కువమంది సభ్యులు రాత్రి సమయంలో తప్పనిసరిగా మండపంలో ఉండాలన్నారు. అధిక సౌండ్‌తో ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. రాత్రి పది గంటల తరువాత లౌడ్ స్పీకర్లకు అనుమతి లేదన్నారు.

సాగర తీరంలో అలరించిన లేజర్ షో

మహారాణిపేట, సెప్టెంబరు 2: సాగర తీరంలో తూర్పు నౌకాదళం వీరోచిత యుద్ధ విజయాలపై సోమవారం లేజర్ షో నిర్వహించారు. విక్టరీ ఎట్ సీ వద్ద ఈస్ట్రన్ నేవల్ కమాండ్, జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలో నౌకాదళ చీఫ్ నేవల్ కమాండర్ రాజేష్ పెందార్కర్, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లా డుతూ ప్రతి వారం లేజర్ షో ఏర్పాటు చేస్తామన్నారు. అద్భుత విజయాలను ఇంగ్లీష్, తెలుగు భాషలలో ప్రజలకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మేయర్ హరివెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్, సీబీ బాగ్చి, నేవల్ అధికారులు పాల్గొన్నారు.



లేజర్‌షో వీక్షిస్తున్న ఎంపీ, సీపీ, ఎమ్మెల్యే, మేయర్, తదితరులు



విక్టర్ ఎట్ సీ వద్ద లేజర్ షో

ముంపులో కొత్తపాలెం శివారు ప్రాంతం

అనధికార లేఅవుట్లలో కట్టడాలు, నిర్మాణ వ్యర్థాల డంపింగ్‌తోనే సమస్య

పట్టించుకోని జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు





చెరువును తలపిస్తున్న కొత్తపాలెం-నరవ ప్రధాన రహదారి. (ఇన్‌సెట్లో) రోడ్డు పక్కన పేరుకుపోయిన వ్యర్థాలు

గోపాలపట్నం, సెప్టెంబరు 2: డీ-పట్టా భూముల్లో అనధికారంగా నిర్మించిన లేఅవుట్లల్లో ఇళ్లు, భారీ భవనాలు, ఖాళీ స్థలాల్లో పెద్దఎత్తున నిర్మాణాల వ్యర్థాలు పేరుకుపోవడంతో కొత్తపాలెం గ్రామ శివారులోని లోతట్టు ప్రాంతం ముంపు సమస్య నెలకొంది. దశాబ్దాల కాలంగా 89వ వార్డు పరిధి కొత్తపాలెం శివారులో జరుగుతున్న ఈ అనధికార లేఅవుట్ల దందాపై రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు స్పందించకపోవడంతో ప్రస్తుతం ఇక్కడి రహదారి ముంపునకు గురై కొత్తపాలెం నుంచి నరవ గ్రామం మీదుగా రాకపోకలు సాగించే సుమారు పది గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏటా వర్షాకాలంలో తమకు ఇక్కట్లు తప్పడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండేళ్లుగా ఈ సమస్య మరింత తీవ్రరూపం దాల్చినా పట్టించుకునే నాథులే కరువయ్యారని వాపోతున్నారు. ఫలితంగా వర్షాల సమయంలో రవాణా సౌకర్యం లేక నానాపాట్లు పడుతున్నామని చెబుతున్నారు.

వరద నీటిలోనే రహదారి

ప్రస్తుతం కురిసిన వర్షాలకు కొత్తపాలెం శివారు రహదారి ముంపునకు గురైంది. రహదారిపై పెద్దఎత్తున చేరిన నీటిని జీవీఎంసీ సిబ్బంది మోటార్లతో తోడుతున్నా ఫలితం కానరావడం లేదు. ముంపు భయంతో షీలానగర్ మీదగా శివారు ప్రాంత ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఒక మోస్తరు వర్షానికే కొత్తపాలెం నుంచి నరవ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి వరద నీటితో ముంపునకు గురవుతోంది. నీటిలో రాకపోకలు సాగించడం వల్ల తమ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. వరద ముంపు వల్ల ఈ మార్గంలో రాకపోకలు సాగించే నరవ, కోటనరవ, సత్తివానిపాలెం, జెర్రిపోతులపాలెం, ఇప్పిలివానిపాలెం, నందవానిపాలెం, చింతగట్ల, తదితర ప్రాంతాలకు చెందిన వేలాది మంది ప్రజలు గోపాలపట్నం చేరడానికి షీలానగర్ నుంచి జాతీయ రహదారి మీదుగా రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అనధికార లేఅవుట్లను తొలగించాలని, ఖాళీ స్థలాల్లో నిర్మాణ వ్యర్థాల డంపింగ్ చేయకుండా చూడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



శంఖు, చక్ర, నామాలు ఏర్పాటు

సాగర్‌నగర్, సెప్టెంబరు 2 : రుషికొండలో ఉన్న శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం నూతన శంఖు, చక్ర నామాలు ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న శంఖు, చక్ర నామాలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల దగ్ధమైన విషయం తెలిసిందే. వాటి స్థానం లో కొత్త వాటిని టీటీడీ అధికారులు ఏర్పాటు చేశారు. బీచ్‌రోడ్డులో వెళ్లే వారికి ఇవి ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి.

సబ్‌మెరైన్‌ల ఫ్లాగ్ ఆఫీసర్‌గా చేతన్



విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో సబ్‌మెరైన్ల 18వ ఫ్లాగ్ ఆఫీసర్‌గా రియర్ అడ్మిరల్ చేతన్ సి చందేగేవ్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. భారత నౌకాదళంలో అన్ని తరగతులకు చెందిన సబ్‌మెరైన్ల వ్యవహారాలను ఆయన పర్యవేక్షించనున్నారు. ఇప్పటివరకు ఇక్కడ కె.వెంకటరామన్ పనిచేశారు.

శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు

పెదగంట్యాడ, సెప్టెంబరు 2: జీవీఎంసీ 75వ వార్డు పరిధి మొల్లిపాలెంలో కృష్ణాష్టమి నాడు ప్రతిష్ఠించిన శ్రీకృష్ణునికి సోమవారం శ్రీమురళీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం చేశారు. కార్పొరేటర్లు పులి లక్ష్మీబాయి, తిప్పల వంశీరెడ్డి, న్యూపోర్టు సీఐ దాలిబాబు, టీడీపీ నాయకుడు పులి వెంకటరమణారెడ్డి తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్న యువకుడు నగరానికి చేరిక

ఎండాడ, సెప్టెంబరు 2: డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాల పేరుతో కంబోడియా దేశానికి వెళ్లి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్న నగరానికి చెందిన మరో యువకుడ్ని సైబర్ క్రైమ్ పోలీసులు సురక్షితంగా నగరానికి తీసుకువచ్చారు. నగరానికి చెందిన పలువురు యువకులు కంబోడియా, మయన్మార్, బ్యాంకాక్ దేశాలకు వెళ్లి జాబ్ స్కామ్ కేసులో ఇరుక్కున్న విషయం తెలిసిందే. గతంలో చాలా మందిని సురక్షితంగా నగరానికి తీసుకువచ్చిన సైబర్ క్రైమ్ పోలీసులు సోమవారం బొద్దపు మోహన్ అనే యువకుడ్ని తీసుకువచ్చారు. ఈ కేసును పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

● **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-12 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
● **మారుతీనగర్ సుబ్రమ్మణ్యం :** శ్రీకన్య, మెలోడీ, నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)
● **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), హెవెన్-3 (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
● **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
● **డిమోంటీ కోలనీ-2 :** శ్రీరామ, మెలోడీ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లక్ష్మీకాంత్ (గాజువాక)
● **తంగలాన్ :** శారద, నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 46, టమాటా 24, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 26, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 28, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 22, క్యారెట్ 30, దొండకాయలు 32, బంగాళదుంపలు 29, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 115, మునక్కాడలు (కిలో) 42, బరబాటి 32, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 95, గోరుచిక్కుడు 34, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 90, పొటల్స్ 38, కీరదోస 32, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 48, కంద 58, దేముడుచిక్కుడు 56, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	91
ఫారం ధర	--	111
విత్ స్కిన్	--	192
స్కిన్‌లెస్	--	202

ఘనంగా పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు



పులగాలిపాలెంలో మొక్కలు నాటుతున్న అయిత సింహాచలం, తదితరులు



మొక్కలు నాటిన మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మీరామునాయుడు, తదితరులు

పెందుర్తి, సెప్టెంబరు 2: జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని ఎస్ఆర్ పురంలో జనసేన నాయకులు గొరపల్లి సోమునాయుడు, దూది రమణ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పాల్గొని పంచాయతీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. సర్పంచ్ దూది వెంకటలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, కునిగంటి కనకరాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే సరిపల్లిలో సర్పంచ్ గొర్లె రామకృష్ణజగన్నాథం, ఎంపీటీసీ గొల్లవిల్లి రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్ర మంలో పంచకర్ల కేక్ కట్ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. సుజాతనగర్‌లోని పార్టీ కార్యాలయంలో వార్డు అధ్యక్షుడు కంచిపాటు మధు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా పులగాలిపాలెంలో జనసేన జిల్లా కార్యదర్శి అయిత సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతాలను ఆచరణలో చూపిస్తూ అందరికీ మార్గదర్శిగా పవన్ నిలుస్తున్నారన్నారు. నాయకులు ఆర్ఎస్ నాయుడు, ఆర్.బుజ్జి, ఈశ్వరరావు, గొర్లె అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: అగనంపూడి, లంకెలపాలెం, తదితర ప్రాంతాల్లో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పార్టీ శ్రేణులు, పవన్ అభిమానుల సమక్షంలో కేకు కట్ చేశారు. అనంతరం ఆయన నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించడంతో పాటు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సర్వసిద్ధి సన్యాసిరాజు, రామారావు, కర్రి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మీరామునాయుడు కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు వరంబాబు, సంజయ్, గణపతి, సతీశ్, శివ, తదిరతులు పాల్గొన్నారు. జనసేన వార్డు అధ్యక్షుడు గవర సోమశేఖర్ ఆధ్వర్యంలో సంపత్ వినాయక ఆలయంలో పవన్ పేరిట పూజలు చేశారు.

కూర్మన్నపాలెం: జనసేనాని పుట్టినరోజును పురస్కరించుకుని 86వ వార్డు పరిధి రాజీవ్ నగర్‌లో జనసేన నాయకుడు గంధం వెంకటరావు ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర నాయకుడు గడసాల అప్పారావు మొక్కలు నాటారు. ముందుగా కేక్ చేశారు. రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే వడ్లపూడిలో జనసేన టీమ్ ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ మొక్కలు నాటారు. 70వ వార్డు పరిధి ఎల్‌వీ నగర్‌లో జనసేన జెండాను ఆవిష్కరించడంతో పాటు ఆల యాల్లో పవన్‌కల్యాణ్ పేరిట పూజలు చేశారు. కార్యక్రమంలో జనసైనికులు లంకల మురళీదేవి, సూరిబాబు, చిరంజీవి, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని జనసేన పార్టీ ఆధ్వర్యంలో శ్రీహరిపురం జీవీఎంసీ మైదానంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిశ్రమలు విడిచిపెట్టే కాలుష్యం నుంచి బయటపడేందుకు అందరూ మొక్కలు నాటాలన్నారు. అనంతరం మైదానం చుట్టూ పలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో జనసేన 'పశ్చిమ' కన్వీనర్ అంగ దుర్గాప్రశాంతి, టీడీపీ 60వ వార్డు అధ్యక్షుడు మాతా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: అందరూ మొక్కలు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని జనసేన జిల్లా నాయకులు గుంటూరు నర్సింహమూర్తి అన్నారు. పవన్ జన్మదినాన్ని పురస్కరించుకుని అక్కిరెడ్డిపాలెంలో జనసేన 68వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని కాలనీలో మొక్కలు నాటారు. నాయకులు వాసు, వెంకటరమణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు. అలాగే నాతయ్యపాలెం, తుంగ్లాం కాలనీలో జనసైనికులు మొక్కలు నాటారు.

వేపగుంట: గ్రేటర్ 94వ వార్డు పరిధి కృష్ణరాయపురం ఆర్టీసీ కాలనీలో జనసేన నాయకుల ఆధ్వర్యంలో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, తదితరులు మొక్కలు నాటారు. మొక్కల పెంపకం ద్వారానే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఆయనన్నారు. అనంతరం కార్పొరేటర్‌ను కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు.

పేదలకు సేవలందించడమే శంకర్ ఫౌండేషన్ లక్ష్యం



శంకరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

వేపగుంట, సెప్టెంబరు 2: శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎ.శంకరరావు జయంతిని నాయుడుతోటలోని సాయిమాధవ నగర్‌లో ఉన్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మేనేజింగ్ ట్రస్టీ ఆత్మకూరు కృష్ణకుమార్ మాట్లాడుతూ నిరుపేదలకు సేవ చేయాలనే తపన, లక్ష్యంతోనే ఈ ఆస్పత్రిని ప్రారంభించడం జరిగిందన్నారు. దివంగత శంకరరావు ఆయన ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. ఫౌండేషన్ అభివృద్ధికి నిత్యం సహాయ సహకారాలను అందిస్తున్న సౌత్ ఏసియా ఎల్‌పీజీ సీఈవో నవీన్ మఖేజ, ఎల్‌అండ్‌టీ జీఎం అతుల్‌కుమార్ శ్రీవాస్తవ, గెయిల్ సీజీఎం ఎల్ఎస్ రావు, బనాక్స్ ప్రతినిధి ఎస్‌వీఎస్ఎన్ రాజు, నెక్కంటి సీ ఫుడ్స్ ప్రతినిధి ఎన్.వెంకటరావు, డీఆర్‌డీవో మాజీ సైంటిస్టు డాక్టర్ రొక్కం రామ్, మనోహర్, కేశవ తదితర ప్రతనిధుల సేవలు మరువలేనివన్నారు. తొలుత ఆస్పత్రి ఆవరణలో ఉన్న శంకరరావు విగ్రహానికి ట్రస్టీలు కృష్ణకుమార్, విజయకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జి.ఎం.కె.రాధాకృష్ణన్, డాక్టర్ నర్సింహ్, డాక్టర్ రవీంద్ర, బంగార్రాజు, రమేశ్‌కుమార్, వేణుగోపాల్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

సింధియా, సెప్టెంబరు 2: జీవీఎంసీ 63వ వార్డు చింతలలోవలో జనసేన పార్టీ కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యేలు గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ వార్డు అధ్యక్షుడు జి.శివ ఆధ్వర్యంలో పవన్ జన్మదినాన్ని పురస్కరించుకుని భారీ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ పశ్చిమ ఇన్‌చార్జి అంగ దుర్గాప్రశాంతి, నాయకులు ప్రదీప్, దాడి లలిత,తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఏఐటీయూసీ జాతీయ నాయకులు

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించొద్దు

ఏఐటీయూసీ జాతీయ సమావేశాల్లో తీర్మానం

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని మరో తీర్మానం

ఉక్కుటౌన్‌షిప్ , సెప్టెంబరు 2: విశాఖ స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరించరాదని, పూర్తి సామర్థ్యంతో కర్మాగారాన్ని నడిపి నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని ఏఐటీయూసీ జాతీయ సమావేశాల్లో తీర్మానం చేసింది. ఉక్కు నగరంలోని గురజాడ కళాక్షేత్రంలో రెండు రోజులుగా ఈ సమావేశాలు జరుగుతున్నాయి. సోమవారం పలు అంశాలపై తీర్మానాలు చేశారు. తొలుత యూనియన్ జాతీయ అధ్యక్షుడు రమేంద్రకుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జీత్‌కౌర్ మాట్లాడుతూ దేశంలో కార్మికుల భద్రత చాలా ముఖ్యమని, భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు అంశాలపై తీర్మానాలు చేశారు. కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, కాంట్రాక్టు కార్మికులకు జీతాలు పెంచి సౌకర్యాలు మెరుగుపరచాలని, దేశంలో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని తీర్మానాలు చేశారు. దేశవ్యాప్తంగా మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేస్తూ వాటిని నియంత్రించేందుకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకోవాలని తీర్మానం చేసింది. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, కేఎస్ఎస్ రావు, జె.రామకృష్ణ, రాజుబాబు, మోహన్‌బాబు పాల్గొన్నారు.

వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళి



కణితిలో వైఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 2: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని వైసీపీ శ్రేణులు సోమవారం పలుచోట్ల నిర్వహించారు. ఇందులో భాగంగా 87వ పరిధి వార్డు కణితిలో వైఎస్సార్ విగ్రహానికి వైసీపీ నాయకుడు ప్రగడ వేణుబాబు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదల గుండుల్లో వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచారన్నారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ముద్దపు దామోదర్, డి.దానప్పలు, బి.గోవిందరాజులు, పి.శ్రీను, కె.వెంకట నారాయణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే కూర్మన్నపాలెంలోని వైఎస్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పూలమాల వేసి అంజలి ఘటించారు.

పెందుర్తి: దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని వైసీపీ 96వ వార్డు అధ్యక్షుడు దాడి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పెందుర్తిలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ హాజరై వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దాడి ఉమామహేశ్వరరావు పలువురు వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉప్పిలి కనకరాజు , వైసీపీ మండల అధ్యక్షుడు గొరపల్లి శ్రీను, మహిళా అధ్యక్షురాలు శరగడం కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: గ్రేటర్ 58వ వార్డు పరిధి పిలకవానిపాలెం జంక్షన్‌లో ఉన్న దివంగత వైఎస్ విగ్రహానికి కార్పొరేటర్ గులిగిందల లావణ్య, వైసీపీ నాయకుడు గులిగిందల కృష్ణ పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అలాగే పారిశ్రామిక ప్రాంతంలో పలుచోట్ల వైసీపీ నాయకులు వైఎస్ వర్ధంతిని నిర్వహించారు.

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అగ్రగామిగా నిలిపిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుందని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మిందిలో వైఎస్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా కార్యదర్శి గుడివాడ లతీశ్, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తి రెడ్డితో పాటు నాయకులు గుడివాడ అప్పలరామ్మూర్తి, ఈటి శ్యామలరావు, ఎస్.నూకరాజు, వి.రమణ, శ్రీరాములు, రాజు, తదితరులు పాల్గొన్నారు.



పెందుర్తిలో వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అదీప్‌రాజ్, దాడి ఉమామహేశ్వరరావు, తదితరులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు పరిధి పద్మనాభనగర్‌లోని వైఎస్ విగ్రహానికి పార్టీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని బెహరా కోరారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: ఎన్ఏడీ కూడలిలోని వైఎస్ విగ్రహానికి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజలకు వైఎస్ చేసిన సేవలను కొనియాడారు. సంజీవయ్యనగర్, కరాస ప్రాంతాల్లోనూ వైఎస్ వర్ధంతిని నిర్వహించారు.

ప్రజల సంక్షేమమే కేంద్రం లక్ష్యం

మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్

గాజువాక, సెప్టెంబరు 2: ప్రజలందరి సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముందుకు సాగుతుందని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ అన్నారు. ఇక్కడి బీజేపీ కార్యాలయంలో సోమవారం పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త కరణంరెడ్డి నరసింగరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల నాలుగో తేదీ నుంచి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపడతామని పేర్కొన్నారు. బీజేపీపై ఆసక్తి ఉన్నవారందరూ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. గాజువాకలో అత్యధికంగా సభ్యత్వ నమోదును చేపట్టాలని మాధవ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు సిరసపల్లి నూకరాజు, దీనంకొండ కృష్ణంరాజు, శ్రీను, రాజేశ్వరరావు, దిలీప్, సత్యారావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణకు పవన్ కృషి చేయాలి

పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 2: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పవన్‌కల్యాణ్ కృషి చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు కోరారు. సోమవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని రిలే నిరాహార దీక్షల శిబిరంలో కేకు కట్ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు గడసాల అప్పారావు, గంధం వెంకటరావులు మాట్లాడుతూ పీఎం మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో అత్యంత సన్నిహిత సంబంధాలున్న పవన్‌కల్యాణ్ ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా సీఎం చంద్రబాబుతో కలిసి వారిపై ఒత్తిడి తేవాలన్నారు. నాయకులు నమ్మి సింహాద్రి, కొమ్మినేని శ్రీనివాస్, రామ్మోహన్‌కుమార్, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కమిషనరేట్‌కు 84 వినతులు

విశాఖపట్నం, సెప్టెంబరు 2: నగర పోలీసు కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 84 ఫిర్యాదులు స్వీకరించినట్టు సీపీ శంఖబ్రత బాగ్చి తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారుతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎమినిటి కార్యదర్శులు బాధ్యతగా పని చేయాలి

విశాఖపట్నం, సెప్టెంబరు 2: వార్డు సచివాలయ ఎమినిటి కార్యదర్శులు బాధ్యతగా పని చేయాలని జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం ఆయన వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ఎమినిటి కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవీఎంసీలో ఇంజనీరింగ్ విభాగం పెద్ద సైన్యమే ఉన్నా.. ఎవరూ క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లడం లేదన్నారు. దీంతో వారికి సచివాలయ పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులపై అవగాహన ఉండడం లేదని చెప్పారు. సచివాలయ పరిధిలో ఎన్ని లైట్లు వెలుగుతున్నాయి, బీటీ, సీసీ రోడ్ల విస్తరణ, కాలువలు, గెడ్డలు, యూజీడీ కనెక్షన్ల తదితర వివరాలు తెలిసి ఉండడంతో పాటు వాటికి అయ్యే నిర్వహణ ఖర్చు అంచనాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. నగరంలో 39 కాలువల ద్వారా మురుగు, వ్యర్థాలు నేరుగా సముద్రంలో కలుస్తున్నాయని, ఎస్టీపీలు తయారయ్యే వరకు వ్యర్థాలను నిరోధించేందుకు ఆయా ప్రాంతాల్లోని గెడ్డలపై జాలీలు అమర్చి నీరు మాత్రమే సముద్రంలో కలిసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. అంతకముందు జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్ ఎమినిటి కార్యదర్శులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విధులపై అవగాహన కల్పించారు.

ఉక్కు ఉత్పాదకత పెంపునకు కృషి: సీఎండీ

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 2: స్టీల్‌ప్లాంటులో ఉత్పాదకతను పెంపొందించేందుకు, కార్యాచరణ సామార్థ్యాన్ని మెరుగుపరిచేందుకు, ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు ఓ సంకల్పంతో ముందుకు సాగుతున్నామని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ఈడీ (వర్క్స్) కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జీరో డ్యామరేజ్ క్యాంపెయినింగ్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అతుల్‌భట్ కర్మాగారంలో ఖర్చు తగ్గింపు, ఉత్పత్తి పెంచడం, లాభాల దిశగా ప్లాంట్‌ను నడిపించటం వంటి అంశాల గురించి వివరించారు. ఆర్థిక లాభాలను సాధించడానికి, స్థిర వ్యయాన్ని, వేరియబుల్ ధరను తగ్గించడం, ఉత్పత్తిని పెంచడం కోసం సమష్టిగా, అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు. జీరో డ్యామరేజ్ క్యాంపెయినింగ్ లాభదాయకత వైపు పయనించే ప్రయత్నంలో తొలి అడుగు వేస్తున్నామన్నారు. టర్న్ ఏ రౌండ్ ప్లాన్‌ను రూపొందించామని, ఇందులో భాగంగా ఉత్పత్తిని పెంచడానికి రెండు ఫర్నేస్‌ల నుంచి ఉత్పత్తిని గరిష్ఠంగా పెం చుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీజీఎం (వర్క్స్) యు.శ్రీధర్, పలువురు అధికారులు, కార్మిక నాయకులు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.42 కోట్లు

సింహాచలం, సెప్టెంబరు 2: వరాహలక్ష్మీనృసింహస్వామి ఖజానాకు హుండీల ద్వారా గత 34 రోజులకు గాను రూ.2. 42 కోట్ల ఆదాయం సమకూరింది. ఈఓ శ్రీనివాసమూర్తి సారధ్యంలో ఆలయ అధికారులు సోమవారం పరకామణి కేంద్రంలో హుండీల లెక్కింపు చేపట్టారు. హుండీల ద్వారా రూ.2,42,40,632 నగదు లభించగా స్వర్ణం 143.4 గ్రాములు, రజితం 13.500 కిలోలు ఆభరణాల రూపంలో భక్తులు హుండీల్లో సమర్పించారు. అలాగే పలు దేశాలకు చెందిన విదేశీ కరెన్సీ కూడా లభించినట్టు అధికారులు ప్రకటించారు.

నష్టాన్ని అంచనా వేయండి: ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, సెప్టెంబరు 2: పారిశ్రామిక ప్రాంతంలో వర్షానికి దెబ్బతిన్న ప్రాంతాలను పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల టీడీపీ అధ్యక్షులతో ఆయన మాట్లాడి వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి నష్టాన్ని అంచనా వేయాలన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో రక్షణ గోడలు కూలిపోవడం వల్ల పలువురికి వివిధ రూపాలలో నష్టం వాటిల్లినట్టు గణబాబు గుర్తించారు. బాధితులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని అధికారులకు సూచించారు. కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలను పటిష్ఠంగా నిర్మించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ 60వ వార్డు అధ్యక్షుడు మాతా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి శ్రావణ పూజలు



జగదాంబ కూడలి, సెప్టెంబరు 2: వన్‌టౌన్ కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసోత్సవ పూజలు 29వ రోజుకు చేరాయి. సోమవారం ఆలయంలో విశిష్ట పూజలను నిర్వహించారు. పండితుల ఆధ్వర్యంలో హోమం, కుంకుమ పూజలు చేశారు. శ్రావణలక్ష్మిగా అమ్మవారిని అలంకరించారు. జేఈవో వి.రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి



సంఘటన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కేకే రాజు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 2: గ్రేటర్ 26వ వార్డులోని వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఉత్తర వైసీపీ ఇన్‌చార్జి కేకే రాజు డిమాండ్ చేశారు. ఆ ప్రాంతాన్ని సోమవారం సందర్శించి దుండగులను పట్టుకొని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, అల్లు శంకరరావు, కె.అనిల్‌కుమార్‌రాజు, రెయ్యి వెంకటరమణ, వావిలపల్లి ప్రసాద్, పద్మారెడ్డి, పీలా వెంకటలక్ష్మి ఉన్నారు.

తెలుగు ఉపాధ్యాయుడికి సత్కారం

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 2: ఎన్‌జీజీఓస్ కాలనీలో ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎంవీ ధర్మారావును మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థ ప్రిన్సిపాల్ చల్లా అంజిరెడ్డి సోమవారం సత్కరించారు. హెచ్‌ఎం బి.లక్ష్మీ నరస, సహోపాధ్యాయులు అభినందించారు.

సీతమ్మధార రైతుబజార్‌లో కలకలం

- ఆక్సిజన్ టవర్స్ పైనుంచి మందుసీసాలు, పెయింటింగ్ సీసాలు విసిరేసిన వైనం
- టవర్స్ వద్ద ఆందోళనకు దిగిన రైతులు



రైతుబజార్‌లో పడిన సీసాలు, రాళ్లు, ఇతర సామగ్రి

సీతమ్మధార, సెప్టెంబరు 2: నగరంలోని అతిపెద్ద సీతమ్మధార రైతుబజార్‌లో కలకలం రేగింది. దీనికి ఆనుకుని ఉన్న ఆక్సిజన్ టవర్స్ అపార్టుమెంట్ పైనుంచి రైతుబజార్‌లోకి అప్పుడప్పుడు సీసాలు, రాళ్లు పడుతున్నాయి. పెద్ద శబ్దం రావడంతో రైతులు, కొనుగోలుదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఆదివారం సాయంత్రం రైతుబజార్ రద్దీగా ఉంది. అదే సమయంలో పెద్ద సంఖ్యలో సీసాలు, ఇతర సామగ్రితో పాటు ఓ రాయి బజార్ మధ్యలో పడ్డాయి. ఓ కొనుగోలుదారుడు గాయపడ్డాడు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్టేట్ అధికారి కొండబాబుతో కలిసి ఆక్సిజన్ టవర్స్ సెక్యూరిటీ గేటు వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. రైతుబజారులో బీరు బాటిళ్లు, మంచినీటి సీసాలు, రాళ్లు పడుతున్నాయని తెలిపారు. దీంతో అపార్టుమెంట్ వాసులు సర్దిచెప్పి పంపివేశారు. దీనిని నగర పోలీసు కమిషనర్ దృష్టికి కొంతమంది తీసుకువెళ్లడన విచారణకు ఆదేశించారు. దీంతో సోమవారం ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి ఆక్సిజన్ టవర్స్ అపార్టుమెంట్ వాసులతో సమావేశం ఏర్పాటు చేసి ఇకపై ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఆక్సిజన్ టవర్స్ వద్ద ఆందోళనకు దిగిన రైతులు

మెరుగైన వైద్య సేవలందించాలి

సీతమ్మధార, సెప్టెంబరు 2: భానోజీ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సోమవారం పరిశీలించారు. అడల్ట్ బీసడీ వాక్సిన్, ఈహెచ్‌ఆర్, ఓపీ, ల్యాబ్ సేవల వివరాలు తెలుసుకున్నారు. సిబ్బందికి సూచనలిచ్చారు.

హెల్మెట్ ధారణపై ప్రత్యేక డ్రైవ్

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 2: ద్విచక్ర వాహనాలు నడిపే వారంతా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ ఎస్‌ఐ వి.వాణిశ్రీ తెలిపారు. అక్కయ్యపాలెం సిగ్నల్ పాయింట్ వద్ద సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.



32వ వార్డులో అన్నదానం ప్రారంభిస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



బీజేపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

జగదాంబ కూడలి, సెప్టెంబరు 2: జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా వన్‌టౌన్ పరిధిలో ఆ పార్టీ నేతలు అన్నసమారాధ నిర్వహించారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పలుచోట్ల జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 33వ వార్డు కార్పొరేటర్ గోడి విజయలక్ష్మి, గోడి నరసింహాచారి ఆధ్వర్యంలో అన్నవితరణ చేశారు. 37వ వార్డులో గరిగిన రవికుమార్, అరుణ్ నేతృత్వంలో కేక్ కత్తిరించి వేడుకలు జరిపారు.

డాబాగార్డెన్స్: రాష్ట్రాభివృద్ధిలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మరిన్ని సేవలు అందించాలని 31వ వార్డు నేతలు అభిలషించారు. పవన్ జన్మదిన వేడుకలను సోమవారం గొల్లలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో కొల్లూరు రూప ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి పిల్లలకు పుస్తకాలు, పెన్సిల్స్, పెన్నులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. మొకర గోపి, పల్లా చందు, బమ్మిడి ఎల్లాజీ, కండేపల్లి శ్రీధర్, ఎన్.రాజేంద్ర, వెంకటేష్, టి.వరలక్ష్మి పాల్గొన్నారు.

కంచరపాలెం: పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను 47వ వార్డులో నిర్వహించారు. కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి ఆధ్వర్యంలో కప్పరాడలో వేడుకలకు ఉత్తర జనసేన నేత పసుపులేటి ఉషాకిరణ్ హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు పండ్లు, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫణి, సురేష్, చిన్న, నాని, రఫీ పాల్గొన్నారు.

జ్ఞానాపురం: గ్రేటర్ 32వ వార్డులో జనసేన నేతలు, కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో పవన్ జన్మదిన వేడుకలు జరిగాయి. ఓమ్నీ, వాసన్ ఐకేర్, సియాన్ కేన్సర్ క్లినిక్, వి డెంటల్ ఆస్పత్రుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీవీ రామ్,బద్రీనాథ్, కేదార్‌నాథ్ పాల్గొన్నారు.

సీతమ్మధార: సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో గల బిజెపి పార్టీ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బిజెపి ఫ్లోర్ లీడర్ పి.విష్ణుకుమార్ రాజు కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన జనసేన నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్‌ను సాలువతో సత్కారించారు. ఈ కార్యక్రంలో బిజెపి నాయకురాలు శ్యామలదీపిక, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా 24వ వార్డు జనసేన పార్టీ వార్డు అధ్యక్షురాలు అడబాల లక్ష్మి ఆధ్వర్యంలో పవన్ జన్మదినం సందర్భంగా జీవీఎంసీ శానిటేషన్ సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. ఉత్తర ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ గురుమూర్తి రెడ్డి, కమిటీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎర్రాజీ జ్యోతికి నేవీ అధికారుల అభినందనలు



నేవల్ కమాండింగ్ ఆఫీసర్ రాజత్ నగ్పాల్, తదితరులతో జ్యోతి

విశాఖపట్నం (స్పోర్ట్స్), సెప్టెంబరు 2: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న ఎర్రాజీ జ్యోతిని ఐఎన్‌ఎస్ కళింగ నేవల్ కమాండ్ అధికారులు సోమవారం అభినందించారు. ఐఎన్‌ఎస్ శాతవాహన ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి కమాండింగ్ ఆఫీసర్ కమాండర్ రాజత్ నగ్పాల్ హాజరై జ్యోతికి మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒలింపిక్ గేమ్స్ మహిళల 100మీ. హర్డిల్స్‌లో దేశానికి ప్రాతినిథ్యం వహించిన తొలి మహిళా అథ్లెట్‌గా ఎర్రాజీ జ్యోతి రికార్డు నెలకొల్పిందన్నారు. కెరీర్‌లో 100మీ. రేస్‌లో అత్యుత్తమ టైమింగ్ (11.47) నెలకొల్పిన జ్యోతి...100మీ. హర్డిల్స్‌లో 12.78 సెకన్ల టైమింగ్‌తో జాతీయ రికార్డు సృష్టించడం విశేషమన్నారు. 2028 లాస్ ఏంజెల్స్‌లో జరిగే ఒలింపిక్స్‌లో దేశానికి పతకం అందించాలని ఆకాంక్షించారు. అనంతరం జ్యోతి ఒలింపిక్స్‌లో తన అనుభవాలను వివరించి, నేవల్ అధికారులు, సిబ్బంది అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చింది. ఈ కార్యక్రమంలో నేవల్ కమాండ్ అధికారులు, సిబ్బంది, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రతినిధులు డి.నాగేశ్వరరావు, ఎం.నారాయణ రావు, ఎంవీ.పవన్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌కు నేతల ఘన నివాళి

సీతమ్మధార, సెప్టెంబరు 2: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయనకు వైసీపీ నేతలు సోమవారం ఘన నివాళి అర్పించారు. 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో నక్కవానిపాలెం ఇందిరాగాంధీ పార్క్‌లో గల వైఎస్ విగ్రహం వద్ద పార్టీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, అల్లు శంకరరావు, కె.అనిల్ కుమార్‌రాజు, వావిలపల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మురళీనగర్: గ్రేటరు 51వవార్డు వైసీపీ కార్యాలయంలో కార్మికులకు పండ్లు పంపిణీ చేశారు. వైఎస్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వార్డు నాయకులు, మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

'దేశ ప్రగతిలో భాష, సాహిత్యానికి కీలక పాత్ర'

సీతంపేట, సెప్టెంబరు 2: దేశాభివృద్ధికి, ప్రగతికి భాష సాహిత్య రంగాలు కీలక పాత్ర పోషిస్తాయని భాషావేత్త డాక్టర్ సుసర్ల శారదా పూర్ణ తెలిపారు. తెలుగు సంస్కృత భాషల్లో విస్తృత పరిశోధన చేసి, విదేశాల్లో అవగాహనా కల్పిస్తున్న ఆమెకు బరంపురం విశ్వవిద్యాలయం డిలిట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా విశాఖ సాహితీ సంస్థ పౌరగ్రంథాలయంలో అభినందన సభ నిర్వహించింది. సంస్థ ఉపాధ్యక్షులు డాక్టర్ కందాళ కనకమహాలక్ష్మి, కార్యదర్శి శంకర్ నీలు భాగవతులు, తదితరులు సత్కరించారు. సుసర్ల రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

వరద బాధితులకు 1.5 లక్షల ఆహార ప్యాకెట్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరదలకు చిక్కుకున్న విజయవాడ ప్రజలకు 1.5 లక్షల ఆహార ప్యాకెట్లు సరఫరా చేసేందుకు కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా పౌరసరఫరాల అధికారి జి.సూర్యప్రకాశరావు సిబ్బందితో కలిసి ఆహారం తయారీలో నిమగ్నమయ్యారు. మంగళవారం ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనాల కోసం మూడు రకాల ఆహార పదార్థాలు సిదం చేశారు. టిఫిన్, పులిహోర, వెజ్ బిర్యానీ ప్యాకెట్లను సింహాచలం దేవస్థానం, అక్షయపాత్రతోపాటు మరికొన్ని ప్రైవేటు కేటరింగ్ సంస్థలు సిద్ధం చేశాయి. వీటిని సోమవారం రాత్రి ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లో తరలించేందుకు రైల్వేశాఖ ఒక బోగీ కేటాయించింది.

ట్రెజరీ కార్యాలయం పైకప్పు నుంచి ఊడిపడిన పెచ్చులు

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ పైఅంతస్తులో ఉన్న జిల్లా ఖజానా కార్యాలయం పైకప్పు నుంచి పెచ్చులు సోమవారం ఊడిపడ్డాయి. డిప్యూటీ డైరెక్టర్ చాంబర్‌కు తూర్పువైపుగా పడడంతో పెద్ద శబ్దం వచ్చింది.. అక్కడ సిబ్బంది లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కార్యాలయం పైకప్పు శిథిలావస్థకు చేరి వర్షం వచ్చినప్పుడల్లా సిబ్బంది వేరోచోట విధులు నిర్వహిస్తుంటారు. వరుసగా మూడు రోజులు కురిసిన వర్షాలకు కార్యాలయం పైకప్పు తడిసిపోయి పెచ్చులు ఊడి పడుతున్నాయి.

నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న అతిథులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 2: పోర్టు ఆస్పత్రి ఎదురుగా 'ఆంధ్రజ్యోతి' కార్యాలయం పక్కన ఉన్న లక్ష్మీ వినాయక ఆలయ సన్నిధానంలో వినాయక నవరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. శ్రీగురుపాద సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహోత్సవాల ఆహ్వాన పత్రికను శైవ ఆగమ పండితులు శివశ్రీ బాలానంద శివాచార్య సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు ప్రతి రోజూ ఆలయంలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అభిషేకాలు, అర్చనలు మహిళలతో పారాయణలు, దివ్య హారతి, అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. తిరిగి సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు అర్చన, షోడచోపచార హారతులు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు ఎంవీఆర్ మూర్తి, పీవీజీ రావు, ఆర్‌వీఆర్ మూర్తి, ఆర్.శ్రీధర్, ఎంవీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఐల బదిలీలపై కొందరు ఎమ్మెల్యేల్లోనూ అసంతృప్తి

- తెగే దాకా లాగకూడదని మౌనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ నగర పరిధిలో జరిగిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలపై కూటమి ఎమ్మెల్యేలు కొందరిలో అసంతృప్తి ఇంకా చల్లారలేదు. సమస్యను తెగేంత వరకు లాగకూడదని కొందరు మౌనం వహిస్తున్నట్టు తెలిసింది. జిల్లాలో ఒకరిద్దరు ఎమ్మెల్యేలు చేసిన సిఫారసులు తప్పితే మిగిలినవారు ఇచ్చిన పేర్లను పోలీస్ అధికారులు పట్టించుకోలేదని తెలుస్తోంది. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు నియోజకవర్గ పరిధిలో మూడు స్టేషన్లున్నాయి. ముగ్గురి పేర్లను ఆయన సూచించినట్టు సమాచారం. అందులో ఒక అధికారిపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని, పోలీస్ పెద్దల నుంచి సమాచారం వచ్చినట్టు తెలిసింది. మిగిలిన రెండు స్టేషన్లకు కూడా ఆయన సూచించిన వారిని కాకుండా వేరే వారిని వేశారు. దాంతో ఆయన వ్యక్తిగత భద్రతకు ప్రభుత్వం కేటాయించిన గన్‌మెన్‌ను ఆదివారం ఉదయం పంపించేశారు. సాయంత్రానికి తేరుకొని వెనక్కి తెచ్చుకున్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు అని పలువురు పెద్దలు సూచించడంతో మనసు మార్చుకున్నట్టు తెలిసింది. సీనియర్ ఎమ్మెల్యేల సిఫారసులను కూడా బుట్టదాఖలు చేయడంతో వారు కూడా రగిలిపోతున్నారు. అధికార పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలు సూచించిన పేర్లను బదిలీల సమయంలో పట్టించుకోకపోవడం ఇదే మొదటిసారని ఆరోపిస్తున్నారు.

జడ్పీ సీఈవో పోస్టుకు పోటీ

... 5వ పేజీ తరువాయి

వ్యవహారం ప్రజా ప్రతినిధుల మధ్య అంతరం పెంచిందని టీడీపీ వర్గాల అభిప్రాయం.

ఎంపీడీవో పోస్టులకూ పోటీ..

ఉమ్మడి జిల్లాలో 39 మండలాలు ఉండగా పెందుర్తి, దేవరాపల్లి, కె.కోటపాడు, వి.మాడుగుల, మాకవరపాలెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాయకరావుపేట, చోడవరం, చీడికాడ, గొలుగొండ, నర్సీపట్నం, రోలుగుంట, సబ్బవరం, ఆనందపురం ఎంపీడీవోలు ఒకేచోట ఐదేళ్లు అంతకంటే ఎక్కువ సర్వీసు పూర్తిచేసుకున్నారు. ఖాళీగా ఉన్న ఐదు మండలాలకు ఎంపీడీవోలను నియమించాల్సి ఉంది. ఒకేచోట ఐదేళ్లకు పైగా పనిచేసిన అధికారులకు బదిలీ చేయాలని గత నెలలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో స్పష్టంచేస్తోంది. ఇంకా బదిలీలకు జీరో సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. దీని ప్రకారం పాయకరావుపేట, చోడవరం, చీడికాడ, గొలుగొండ, నర్సీపట్నం, రోలుగుంట, సబ్బవరం, ఆనందపురం తదితర ఎనిమిది మండలాల ఎంపీడీవోలు విధిగా బదిలీ కావాల్సిందే. ఐదేళ్ల కంటే తక్కువ సర్వీసున్న 12 మంది ఎంపీడీవోలు, అంతర్ జిల్లాల బదిలీల్లో భాగంగా ఉమ్మడి జిల్లాకు రావాలని తొమ్మిది మంది ఎంపీడీవోలు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎక్కువ మండలాల్లో ఎంపీడీవోలకు స్థానచలనం ఉంటుందని, అందుకు తగినట్టుగానే పలువురు ప్రజా ప్రతినిధుల నుంచి సిఫారసు లేఖలు తీసుకున్నారని సమాచారం. గత ప్రభుత్వంలో కీలక మండలాల్లో పనిచేసిన ఎంపీడీవోలు అప్పటి వైసీపీ నాయకులతో అంటకాగారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు వారంతా కూటమి నేతల చుట్టు తిరుగుతూ తామంతా అనుకూలంగా పనిచేస్తామని నమ్మబలుకుతున్నారు. నగర పరిసరాలు, మైదానంలో జాతీయ రహదారికి ఆనుకుని మండలాల్లో ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారిని విధిగా ఏజెన్సీకి బదిలీ చేయాలని, అక్కడి ఎంపీడీవోలు కోరుతున్నారు. దీంతో వారికి మైదానంలో అవకాశం దొరుకుతుందని అభిప్రాయపడుతున్నారు.

మహిళ పొట్టలో ఎముకల గూడు

- శస్త్రచికిత్స చేసి తొలగించిన కేజీహెచ్ వైద్యులు



తొలగించిన ఎముకల గూడు

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కింగ్ జార్జ్ ఆస్పత్రిలోని గైనకాలజీ విభాగానికి చెందిన వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను నిర్వహించారు. మహిళ పొట్టలో పేగులు చుట్టూ ఏర్పడిన ఎముకల గూడును శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. ఈ తరహా కేసులు ఇప్పటివరకూ దేశంలో 25 వరకు మాత్రమే నమోదయ్యాయని, విశాఖలో తొలిసారి ఇటువంటి శస్త్రచికిత్సను నిర్వహించినట్టు వైద్యులు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లాకు చెందిన 27 ఏళ్ల మహిళ గతంలో ఇద్దరికి జన్మనిచ్చింది. మూడేళ్ల కిందట మరోసారి గర్భం దాల్చింది. పిల్లలు వద్దనుకున్న ఆమె అబార్షన్ నిమిత్తం మందులు వినియోగించారు. అబార్షన్ అయినట్టు ఆమెకు వైద్యులు చెప్పారు. అయితే, అప్పటి నుంచి సదరు మహిళ తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ వస్తోంది. ఎంతమంది వైద్యులకు చూపించినా పరిష్కారం లభించలేదు. కొద్దిరోజుల కిందట కేజీహెచ్‌కు వచ్చిన ఆమెకు వైద్యులు అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయించారు. ఈ స్కానింగ్‌లో కడుపులో కణితిని గుర్తించారు. పూర్తిస్థాయిలో స్పష్టత కోసం ఎంఆర్‌ఐ స్కానింగ్ చేయించగా, 24 వారాలు శిశువుకు సంబంధించిన ఎముకల గూడు ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. దీనినే వైద్య పరిభాషలో లిథోపెడియన్ (శిశువు ఎముకలగూడు)గా పేర్కొంటారని కేజీహెచ్ గైనిక్ విభాగం మూడో యూనిట్ ప్రొఫెసర్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. ఈ నేపథ్యంలో ఐ.వాణి, ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఆనంద్ సహకారంతో శస్త్ర చికిత్స నిర్వహించారు. శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన వైద్యులను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద అభినందించారు. ఆమె ఆరోగ్యంగా ఉందని, కోలుకుందని డాక్టర్ ఐ.వాణి తెలిపారు. మంగళవారం డిశ్చార్జ్ ఇస్తామన్నారు. అత్యంత అరుదుగా ఇటువంటి కేసులను చూస్తుంటామన్నారు.

అప్పుడూ వారే... ఇప్పుడూ వారే!!

... 5వ పేజీ తరువాయి

వెల్లువెత్తాయి. దీనిపై అప్పటి కమిషనర్లు విచారణకు ఆదేశించారు. తనకున్న రాజకీయపలుకుబడితో విచారణ నుంచి బయటపడ్డారని జీవీఎంసీ అధికారులు చెబుతుంటారు. అంతేకాకుండా ఒక పరిశ్రమ సీఎస్‌ఆర్ కింద మంజూరుచేసిన నిధులను జోనల్ కమిషనర్ ఖాతాకు కాకుండా తన వ్యక్తిగత ఖాతాలో వేయించుకున్నారని ఆరోపణలు వచ్చాయి. అదే సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆ అంశం మరుగునపడిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నగరంలోని ఒక కీలక ప్రజా ప్రతినిధిని ప్రసన్నం చేసుకుని తిరిగి కీలకమైన జోన్‌కు కమిషనర్‌గా పోస్టింగ్ తెచ్చుకున్నారు. సదరు అధికారికి ఆ జోనల్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇవ్వొద్దని ఆ ప్రాంత కార్పొరేటర్లు సంబంధిత ప్రజా ప్రతినిధికి స్పష్టం చేశారు. అయినప్పటికీ పట్టించుకోకుండా సిఫారసు లేఖ ఇచ్చారని కార్పొరేటర్లే ఆరోపిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఇంకో జోన్‌కు కమిషనర్‌గా పోస్టింగ్ దక్కించుకున్న అధికారి కూడా ఎన్నికలకు ముందు వరకూ వైసీపీ కార్యకర్త మాదిరిగా వ్యవహరించారని కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో పొరుగు జిల్లాకు బదిలీపై వెళ్లినప్పటికీ కూటమి అధికారంలోకి రాగానే తన సామాజికి వర్గానికి చెందిన పొరుగు జిల్లా నేతను పట్టుకుని కీలకమైన జోన్‌లో పోస్టింగ్ దక్కించుకున్నారు. తాజా పోస్టింగ్‌లలో మరో కీలకమైన జోన్‌కు కమిషనర్‌గా వచ్చిన అధికారి కూడా వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు ముఖ్యమైన జోన్‌లకు కమిషనర్‌గా పనిచేశారని ఎన్నికల సమయంలో పొరుగు జిల్లా మునిసిపాలిటీకి కమిషనర్‌గా వెళ్లినప్పటికీ కూటమి అధికారంలోకి రాగానే తిరిగి నగరానికి చేరిపోయారని విమర్శిస్తున్నారు. కూటమిలోని కొంతమంది ప్రజా ప్రతినిధులకు పార్టీల ప్రయోజనాల కంటే వారి వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యమైపోయాయని, అందువల్లే వారిని ప్రసన్నం చేసుకుంటే గతంలో చేసిన తప్పులన్నీ ఒప్పులైపోయినట్టు భావించి సిఫారసు లేఖలు ఇస్తున్నారని కార్యకర్తలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

భారీగా రైళ్ల రద్దు

... 5వ పేజీ తరువాయి

గత్యంతరం లేక ప్లాట్‌ఫారంపై కూర్చొని కాలక్షేపం చేస్తున్నారు.

నేడు విశాఖ నుంచి విజయవాడకు ప్రత్యేక రైలు

పలు రైళ్లు రద్దు అయిన నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం మంగళవారం విశాఖ నుంచి విజయవాడకు (ఒక వైపు) ప్రత్యేక రైలును అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 08581 నంబర్‌తో ఈ రైలు మధ్యాహ్నం 12.55 గంటలకు విశాఖలో బయలుదేరి రాత్రి 7.15 గంటలకు విజయవాడ చేరుతుందన్నారు. రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ నడిచే సమయంలో బయలుదేరే ఈ ప్రత్యేక రైలు 16 సెకండ్ క్లాస్ సిట్టింగ్, రెండు జనరల్ సెకండ్ క్లాస్, రెండు ఏసీ చైర్ కార్, రెండు సెకండ్ క్లాస్ కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లతో నడుస్తుందన్నారు.

హెల్మెట్‌పై స్పెషల్ డ్రైవ్

... 5వ పేజీ తరువాయి

లేకుండా ద్విచక్ర వాహనం నడిపేవారెవరైనా సరే...కేసు నమోదుచేయాల్సిన పోలీసులు కొంతమందిని చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. తమ (పోలీస్) శాఖ సిబ్బందిని, న్యాయవాదులను, రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నవారినీ హెల్మెట్ లేకపోయినా ఆపడం లేదు. కొంతమందిని ఆపినా...తాము ఫలానా అని చెబితే పంపించేస్తున్నారు. అదే ఇతరులెవరైనా హెల్మెట్ లేకుండా వాహనంపై వస్తుంటే అంత దూరం నుంచే ఆపడానికి సిద్ధమైపోతున్నారు. జంక్షన్ వద్దకు రాగానే బైక్ తాళం తీసేసుకుని పక్కకు రమ్మని ఆదేశించి ఫొటోలు తీసి, కేసు నమోదుచేసి పంపిస్తున్నారు. ఈ విషయంలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉక్కులో వీఆర్‌ఎస్

... 5వ పేజీ తరువాయి

ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. మరికొన్ని విభాగాల్లో వారానికి ఐదు రోజులే పనిచేయాలని, నెలకు 20 రోజులకు మించి చేయడానికి వీల్లేదని ఆంక్షలు పెట్టారు. పరోక్షంగా పని దినాలు తగ్గించేస్తున్నారు.

ఉత్పత్తికి విఘాతం


ప్లాంటులో మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా 2021-22 ఆర్థిక సంవత్సరంలో రోజుకు 21 వేల టన్నుల ఉత్పత్తి తీసేవారు. ఆ తరువాత సామర్థ్యం మరింత పెరిగింది. అయితే వీటికి అవసరమైన ముడిపదార్థాలు సరఫరా చేయలేక ప్రస్తుత యాజమాన్యం రెండు బ్లాస్ ఫర్నేస్‌లు మూసేసి ఒకటి మాత్రమే నడుపుతోంది. దాంతో ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. వ్యయం పెరిగి, ఆదాయం తగ్గడంతో నష్టాలు వస్తున్నాయి. దాంతో ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవాలని మంత్రిత్వ శాఖ ఒత్తిడి పెడుతోంది. వాస్తవానికి ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపడానికి అవసరమైనవి సమకూర్చాల్సిన ప్రభుత్వం దానిని వదిలేసి ఉద్యోగుల సంఖ్య కోతపై దృష్టి పెట్టింది. విశాఖ స్టీల్ ప్లాంటును ఆదుకుంటామని ఇక్కడికి వచ్చి మరీ చెప్పిన కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి హామీ 45 రోజులు దాటిని అమలు కాలేదు.

విమాన టికెట్ల ధరలకు రెక్కలు

... 5వ పేజీ తరువాయి

కూడా నిలిచిపోవడంతో గత్యంతరం లేక రేటు ఎక్కువైనా విమానంలో వెళ్లాలని యత్నిస్తున్నారు. దాంతో రేట్లు 50 శాతం పెరిగిపోయాయి. సాధారణంగా హైదరాబాద్ వారం, పది రోజుల ముందు టికెట్ బుక్ చేసుకుంటే రూ.4 వేలకు లభిస్తుంది. అదే ఒకటి, రెండు రోజుల ముందు అయితే ఇంకో వేయి రూపాయలు పెరుగుతుంది. ఇప్పుడు రైళ్ల రద్దు ప్రభావంతో ఒక్కో టికెట్ రూ.6,500 పైనే విక్రయిస్తున్నారు. ఇంటర్వ్యూలకు హాజరు కావలసినవారు, విదేశాలకు కనెక్టింగ్ విమానాలు అందుకోవలసిన వారు తప్పనిసరై ఆ రేటుకు టికెట్ కొని వెళుతున్నారు. అదృష్టవశాత్తూ విమాన సర్వీసులకు ఆటంకం లేకపోవడం విశేషం.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఘన నివాళి



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా తీరంలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేయర్ హరికుమారి, తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు సింగిల్ విండో అనుమతులు: సీపీ

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 2: వినాయక ఉత్సవాల నిర్వహణకు సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు పొందవచ్చునని నగర పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిర్వాహకులు గణేష్‌ఉత్సవ్.నెట్ అనే వెబ్‌సైట్‌లో గణేష్ మండపం ఏర్పాటు చేయదలచిన కమిటీ సభ్యులు వివరాలు, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ఠ జరిగే రోజు, ఏ వాహనంలో నిమజ్జనం చేస్తారు వంటి వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు ఆధ్వర్యంలో పురపాలక, అగ్నిమాపక, విద్యుత్ సిబ్బంది మండపం ఏర్పాటు చేసే ప్రదేశాన్ని సందర్శించి సానుకూలంగా ఉంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రం జారీ చేస్తారన్నారు. అనంతరం ఎస్‌హెచ్‌ఓ వాటిని పరిశీలించి ఎన్‌ఓసీ జారీ చేస్తారన్నారు. ఎన్‌ఓసీ ప్రింట్ తీసి గణేష్ మండపంలో ఉంచాలన్నారు. నిర్వాహకుల్లో ముగ్గురు కంటే ఎక్కువమంది సభ్యులు రాత్రి సమయంలో తప్పనిసరిగా మండపంలో ఉండాలన్నారు. అధిక సౌండ్‌తో ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. రాత్రి పది గంటల తరువాత లౌడ్ స్పీకర్లకు అనుమతి లేదన్నారు.

సాగర తీరంలో అలరించిన లేజర్ షో

మహారాణిపేట, సెప్టెంబరు 2: సాగర తీరంలో తూర్పు నౌకాదళం వీరోచిత యుద్ధ విజయాలపై సోమవారం లేజర్ షో నిర్వహించారు. విక్టరీ ఎట్ సీ వద్ద ఈస్ట్రన్ నేవల్ కమాండ్, జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలో నౌకాదళ చీఫ్ నేవల్ కమాండర్ రాజేష్ పెందార్కర్, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి వారం లేజర్ షో ఏర్పాటు చేస్తామన్నారు. అద్భుత విజయాలను ఇంగ్లీష్, తెలుగు భాషలలో ప్రజలకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మేయర్ హరివెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్, సీబీ బాగ్చి, నేవల్ అధికారులు పాల్గొన్నారు.



లేజర్‌షో వీక్షిస్తున్న ఎంపీ, సీపీ, ఎమ్మెల్యే, మేయర్, తదితరులు



విక్టర్ ఎట్ సీ వద్ద లేజర్ షో



అప్పన్న హుండీ ఆదాయం రూ.2.42 కోట్లు

సింహాచలం, సెప్టెంబరు 2 : వరాహలక్ష్మీనృసింహ స్వామి ఖజానాకు హుండీల ద్వారా గత 34 రోజులకు గాను రూ.2.42 కోట్ల ఆదాయం సమకూరింది.ఈఓ శ్రీనివాసమూర్తి సారథ్యంలో ఆలయ అధికారులు సోమవారం పరకామణి కేంద్రంలో హుండీల లెక్కింపు చేపట్టారు. హుండీల ద్వారా రూ.2,42,40,632 నగదు లభించగా స్వర్ణం 143.4 గ్రాములు, రజితం 13.500 కిలోలు ఆభరణాల రూపంలో భక్తులు హుండీల్లో సమర్పించారు. అలాగే పలు దేశాలకు చెందిన విదేశీ కరెన్సీ కూడా లభించినట్టు అధికారులు ప్రకటించారు.

వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, సెప్టెంబరు 2 : వరాహలక్ష్మీనృసింహ స్వామికి సోమవారం పలు ఆర్జిత సేవలను వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ సహస్రనామావళి పఠిస్తూ తులసీ దళాలతో అర్చన జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

శంఖు, చక్ర, నామాలు ఏర్పాటు



సాగర్‌నగర్, సెప్టెంబరు 2 : రుషికొండలో ఉన్న శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం నూతన శంఖు, చక్ర నామాలు ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న శంఖు, చక్ర నామాలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల దగ్ధమైన విషయం తెలిసిందే. వాటి స్థానంలో కొత్త వాటిని టీటీడీ అధికారులు ఏర్పాటు చేశారు. బీచ్‌రోడ్డులో వెళ్లే వారికి ఇవి ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి.

పోలీసు కమిషనరేట్‌కు 84 వినతులు

మహారాణిపేట, సెప్టెంబరు 2 : నగర పోలీసు కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 84 ఫిర్యాదులు స్వీకరించినట్టు సీపీ శంఖబ్రత బాగ్చి తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారుతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సబ్ మెరైన్‌ల ఫ్లాగ్ ఆఫీసర్‌గా చేతన్

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో సబ్‌మెరైన్ల 18వ ఫ్లాగ్ ఆఫీసర్‌గా రియర్ అడ్మిరల్ చేతన్ సి చందేగేవ్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. భారత నౌకాదళంలో అన్ని తరగతులకు చెందిన సబ్‌మెరైన్ల వ్యవహారాలను ఆయన పర్యవేక్షించనున్నారు. ఇప్పటివరకు ఇక్కడ కె.వెంకటరామన్ పనిచేశారు.

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెదవాల్తేరు, సెప్టెంబరు 2 : జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు రుణాల మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు జి.మాధవి తెలిపారు. సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 18 నుంచి 60 ఏళ్ల లోపు వయస్సు ఉండి 40 శాతం అంగవైకల్యం ఉన్న వారు అర్హులని చెప్పారు. అర్హులైన వారు ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 0891-2952585, 9441416375 ఫోన్ నంబర్లను సంప్రతించాలని సూచించారు.

సినిమా గైడ్

- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1,2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** శ్రీకన్య, మెలోడి, నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), హెవెన్-3 (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **డిమొంటీ కోలనీ-2 :** శ్రీరామ, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **తంగలాన్ :** శారద, నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 46, టమాటా 24, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 26, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 28, బీరకాయలు 36, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజి, 22, క్యారెట్ 30, దొండకాయలు 32, బంగాళదుంపలు 29, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 42, అల్లం (పాతది) 115, బరబటి 32, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 95, గోరుచిక్కుడు 34, దోసకాయ 20, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 90, పొటల్స్ 38, కీరదోస 32, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 48, కంద 58, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	91
ఫారం ధర	--	111
విత్ స్కిన్	--	192
స్కిన్‌లెస్	--	202

కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు పటిష్టం

- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్
- మధురవాడ ప్రాంతంలో పర్యటన



కొండవాలు ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

కొమ్మాది, సెప్టెంబరు 2 : కొండవాలు ప్రాంతాల్లో తక్షణమే రక్షణ గోడలను పటిష్ఠం చేయాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన 5వ వార్డు పరిధిలోని కొండవాలు ప్రాంతాలైన వికలాంగుల కాలనీ, స్వయంకృషి కాలనీల్లో పర్యటించారు.ఈ సందర్భంగా వార్డులోని కొండవాలు ప్రాంతాల్లో ఉన్న సమస్యలను కార్పొరేటర్ మొల్లి హేమలత కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కొండవాలు ప్రాంతాల్లో ఉంటున్న వారు తుపాన్లు సంభవించినప్పుడు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారని, రక్షణ గోడలు దెబ్బతిన్నాయని చెప్పారు. మంచినీటికి కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ అధికారులు తక్షణమే రక్షణ గోడలను పటిష్ఠం చేయడానికి చర్యలు తీసుకుంటారని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.తాగునీటి ఇబ్బంది లేకుండా కాలనీలో అవసరమైన చోట పైపులైన్లు వేయటానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎస్ఈ శ్రీనివాస ప్రసాద్‌ను ఆదేశించారు. నగరంలో పలు కొండవాలు ప్రాంతాలను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు సహాయక చర్యలు అందించడానికి 80 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోన్-2 కమిషనర్ శైలజావల్లి, ఈఈ శాంతి రాజు, ఏఎంహెచ్ఓ కిషోర్, ఏఈ సురేష్ పాల్గొన్నారు.

ఎమినిటి కార్యదర్శులతో సమీక్ష

సిరిపురం : వార్డు సచివాలయ ఎమినిటీ కార్యదర్శులు బాధ్యతగా పని చేయాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశించారు.సోమవారం ఆయన వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ఎమినిటి కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవీఎంసీలో ఇంజనీరింగ్ విభాగం పెద్ద సైన్యమే ఉన్నా.. ఎవరూ క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లడం లేదన్నారు. దీంతో వారికి సచివాలయ పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులపై అవగాహన ఉండడం లేదని చెప్పారు. సచివాలయ పరిధిలో ఎన్ని లైట్లు వెలుగుతున్నాయి, బీటీ, సీసీ రోడ్ల విస్తరణ, కాలువలు, గెడ్డలు, యూజీడీ కనెక్షన్ల తదితర వివరాలు తెలిసి ఉండడంతో పాటు వాటికి అయ్యే నిర్వహణ ఖర్చు అంచనాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.నగరంలో 39 కాలువల ద్వారా మురుగు, వ్యర్థాలు నేరుగా సముద్రంలో కలుస్తున్నాయని, ఎస్టీపీలు తయారయ్యే వరకు వ్యర్థాలను నిరోధించేందుకు ఆయా ప్రాంతాల్లోని గెడ్డలపై జాలీలు అమర్చి నీరు మాత్రమే సముద్రంలో కలిసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు.అంతకముందు జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్ ఎమినిటి కార్యదర్శులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విధులపై అవగాహన కల్పించారు.

కొమ్మాదిలో వనమహోత్సవం

కొమ్మాది, సెప్టెంబరు 2 : మొక్కలతోనే పర్యావరణానికి రక్షణ అన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. వన మహోత్సవంలో భాగంగా సోమవారం ఆయన కొమ్మాది చెరువు వద్ద మొక్కలు నాటారు. అనంతరం చెరువు చుట్టూ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువు చుట్టూ వాకర్స్‌కు అనువుగా ట్రాక్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం గత ప్రభుత్వ హయాంలో తలపెట్టిన కొమ్మాదిలోని కల్యాణ మండపాన్ని పరిశీలించారు. పనులు అసంపూర్తిగా ఉండడంతో ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ప్రతిపాదనలు తయారుచేసి పంపించాలని, కమిషనర్‌తో మాట్లాడి నిధుల విడుదలకు కృషి చేస్తానని చెప్పారు. ఈకార్యక్రమంలో 5వ వార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, గొలగాని సన్యాసిరావు, గరే గురునాథ్, రెడ్డి సత్యనారాయణ, యార్లగడ్డ జీవన్, మొల్లి లక్ష్మణరావు,వాండ్రాసి అప్పలరాజు, నాగోతి సత్యనారాయణ, బోయి వెంకటరమణ, రమాదే, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వాడబలిజ నాయకుల వినతి

వాడబలిజ అభ్యున్నతికి కృషి చేయాలని కోరుతూ ఆ సంఘం నాయకులు గంటాకు వినతిపత్రం అందజేశారు. సోమవారం వారు మధురవాడలో గంటాను కలిసి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు సోడిపల్లి నారాయణరావు, ఉపాధ్యక్షుడు దౌలపల్లి దాసు, ప్రధాన కార్యదర్శి మైలపల్లి నాగరాజు, కోశాధికారి కొండలరావు పాల్గొన్నారు.

భైరవస్వామికి అమావాస్య పూజలు

సింహాచలం, సెప్టెంబరు 2 : వరాహలక్ష్మీనృసింహస్వామి అనుబంధ ఆలయం భైరవస్వామికి శ్రావణమాస బహుళపక్ష అమావాస పురస్కరించుకుని భక్తులు సోమవారం పూజలు చేశారు. వేకువజామున ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడిశా సరిహద్దు గ్రామాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో సింహాచలం చేరుకున్నారు. స్వామివారి వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరించి భైరవస్వామిని దర్శించుకుని పంచామృతాభిషేకాలు చేసి అమృతకలశాలను, వడమాలలను, మొక్కుబడిగా సమర్పించారు.

వెంకోజీపాలెం : కొత్త వెంకోజీపాలెం గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో వేంచేసి ఉన్న కాలభైరవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ప్రకాష్‌శర్మ, సుబ్రహ్మణ్య శాస్త్రి, భాస్కర శర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

27న ప్రతిభా ప్రహ్లాద్‌కు వైశాఖీ జీవన సాఫల్య పురస్కారం

వెంకోజీపాలెం, సెప్టెంబరు 2 : అంతర్జాతీయ భరతనాట్య కళాకారులు ప్రతిభా ప్రహ్లాద్‌కు ఈఏడాదికి గాను వైశాఖీ జీవన సాఫల్య పురస్కారం ఇవ్వనున్నట్టు నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ నిర్వాహకుడు బత్తిన రంగ విక్రమ్ కుమార్ గౌడ్ తెలిపారు.సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో జరిగే 16వ అఖిల భారత శాస్త్రీయ నృత్యోత్సవంలో భాగంగా ప్రతిభాప్రహ్లాద్‌కు పురస్కారం ప్రదానం చేస్తామని చెప్పారు.



ఎండాడ జనసేన కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



భీమిలి బీచ్ క్లీనింగ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్

మొక్కలు నాటడం నిరంతర ప్రక్రియ కావాలి

- ఎంపీ ఎం. శ్రీభరత్
- ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు



ఆరిలోవలోని శ్రీకాంత్‌నగర్‌లో మొక్క నాటిన ఎమ్మెల్యే వెలగపూడి

భీమునిపట్నం, సెప్టెంబరు 2 : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం నిరంతర ప్రక్రియ కావాలని ఎంపీ ఎం. శ్రీభరత్ అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినోత్సవం పురస్కరించుకుని జనసేన పార్టీ ఆధ్వర్యంలో జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద సోమవారం ఆయన మొక్కలు నాటారు. అనంతరం బీచ్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టి, అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై బర్త్ డే కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్, 3వ వార్డు అధ్యక్షుడు అక్కరమాని దివాకర్, నాయకులు పరిమి భువనేశ్వరి, వాసుపల్లి అనిల్, గుడివాడ కిరణ్,శాఖరి శ్రీనివాస్, తమ్మిన అప్పలరాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మారోజు సంజీవ్‌కుమార్, బీజేపీ నాయకులు రామానాయుడు, సునీత, విజయ పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫణికుమార్ శిబిరాన్ని ఏర్పాటు చేయగా, విశాఖ ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ జీవన్ ప్రకాశ్ ఆధ్వర్యంలో సిబ్బంది దాతల నుంచి రక్తం సేకరించారు.

ఆరిలోవ : శ్రీకాంత్‌నగర్‌లో జనసేన వార్డు అధ్యక్షురాలు నీలి వెంకట నాగబాబు ఆధ్వర్యంలో పవన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పద్మనాభం : అయినాడ పంచాయతీ యాతపేటలో జనసేన నాయకులు పవన్ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది వికలాంగులు, వృద్ధులు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే అయినాడ సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు.

కొమ్మాది : నగరంపాలెంలో నక్క శ్రీధర్ ఆధ్వర్యంలో పవన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో 5వ వార్డు అధ్యక్షుడు నాగోతి సత్యనారాయణ, మొల్లి లక్ష్మణరావు, సోంబాబు,యార్లగడ్డ జీవన్, నాగోతినాయుడు పాల్గొన్నారు. అలాగే 5వ వార్డు జనసేన అధ్యక్షుడు దేవర శివ ఆధ్వర్యంలో మారికవలసలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

భీమిలిలో చిరంజీవి బ్లడ్ బ్యాంక్

ఎండాడ : భీమిలి నియోజకవర్గంలో చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు కృషి చేస్తానని, ఏడాదిలోపే ప్రారంభించడానికి చిరంజీవితో మాట్లాడతానని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. పవన్ జన్మదినం పురస్కరించుకుని ఎండాడలో జనసేన కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేసి, కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు.

ఎంవీపీ కాలనీ : పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు ఎంవీపీ కాలనీలోని జనసేన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ యువజన విభాగం నాయకుడు డాక్టర్ మర్రి వేముల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో సునీల్, శ్రీనివాస్ పట్నాయక్, రూప, సుబ్బారావు, పూర్ణ పాల్గొన్నారు.

వెంకోజీపాలెం : జీవీఎంసీ 15వ వార్డు నాయకులు దుర్గానగర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించడంతో పాటు వెయ్యి మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

మధురవాడ : పవన్ అభిమానులు మజ్జి విజయకుమార్, తామడ అఖిల్ ఆధ్వర్యంలో చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం మధురవాడ అనాథ ఆశ్రమం పిల్లలకు మధ్యాహ్న భోజనం సమకూర్చారు.

ఆనందపురం : వేములవలస జంక్షన్‌లో ఉన్న జనసేన కార్యాలయంలో పవన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. వెల్లంకి గ్రామంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

సింహాచలం : పవన్ జన్మదిన వేడుకల్లో భాగంగా సింహాచలం ప్రధాన కూడలిలో జనసేన నాయకులు మొక్కలు పంపిణీ చేశారు. సుమారు 300 మొక్కలు పంపిణీ చేసి, వాటిని నాటడమే కాకుండా సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సాగర్‌నగర్ : అల్లూరి సీతారామరాజు కూడలి వద్ద కూడా పవన్ జన్మదిన వేడుకలు జరిగాయి. నాయకులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బొడ్డు శ్రీనివాసరావు, కార్పొరేటర్ లొడగల అప్పారావు, దొరబాబు, శతపతి మంగాదేవి, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించొద్దు

ఏఐటీయూసీ జాతీయ సమావేశాల్లో తీర్మానం

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 2 : విశాఖ స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరించరాదని, పూర్తి సామర్థ్యంతో కర్మాగారాన్ని నడిపి నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని ఏఐటీయూసీ జాతీయ సమావేశాల్లో తీర్మానం చేసింది. ఉక్కు నగరంలోని గురజాడ కళాక్షేత్రంలో రెండు రోజులుగా ఈ సమావేశాలు జరుగుతున్నాయి. సోమవారం పలు అంశాలపై తీర్మానాలు చేశారు. తొలుత యూనియన్ జాతీయ అధ్యక్షుడు రమేంద్రకుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జీత్‌కౌర్ మాట్లాడుతూ దేశంలో కార్మికుల భద్రత చాలా ముఖ్యమని,భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు అంశాలపై తీర్మానాలు చేశారు. కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, కాంట్రాక్టు కార్మికులకు జీతాలు పెంచి సౌకర్యాలు మెరుగుపరచాలని, దేశంలో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని తీర్మానాలు చేశారు. దేశవ్యాప్తంగా మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేస్తూ వాటిని నియంత్రించేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని తీర్మానం చేసింది. కార్యక్రమంలో నాయకులు డి. ఆదినారాయణ, కేఎస్ఎన్ రావు, జె. రామకృష్ణ, రాజుబాబు, మోహన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి

భీమునిపట్నం, సెప్టెంబరు 2 : పట్టణంలోని మూడో వార్డులో వైసీపీ నాయకులు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 15 వర్ధంతి సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు ముత్తంశెట్టి మహేష్ వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పాత బస్టాండ్ సమీపంలోను, చిన్నబజారు జంక్షన్, తోటవీధిలో వున్న వైఎస్ఆర్ విగ్రహాలకు కూడా పూలమాలవేసి నివాళులు అర్పించారు.

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు పరిధిలో పలుచోట్ల వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సభలు నిర్వహించారు. జీరుపేట పార్టీ కార్యాలయంలో జీరు వెంకటరెడ్డి అధ్యక్షతన నాయకులు, కార్యకర్తలు వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సంగివలస, తగరపువలసలోనూ కార్యకర్తలు వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. భీమిలి మండలంలోని గొల్లల తాళ్లవలస అనాథ ఆశ్రమంలో పిల్లలకు వైసీపీ నాయకులు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మైలపల్లి లక్ష్మణరావు, అల్లిపల్లి నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎండాడ : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో ఉన్న వైసీపీ జిల్లా కార్యాలయంలోనూ వైఎస్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, జహీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : వైసీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్ఆర్ ఆశయ సాధనకు కృషి చేయాలని పార్టీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ పిలుపునిచ్చారు. వేములవలసలో జరిగిన వైఎస్ఆర్ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కోరాడ వెంకటరావు, మజ్జి వెంకటరావు, బంక సత్యన్నారాయణ, గంట్రెడ్డి శ్రీనివాస్, కోరాడ అప్పలస్వామినాయుడు పాల్గొన్నారు.

వెంకోజీపాలెం : జీవీఎంసీ 15, 16 వార్డుల్లోనూ వైఎస్సార్ వర్ధంతి సభలు జరిగాయి. 15వ వార్డులో మాజీ కార్పొరేటర్ నడింపల్లి కృష్ణంరాజు ఆధ్వర్యంలోనూ 16వ వార్డులో కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, మొల్లి అప్పారావు ఆధ్వర్యంలోనూ నాయకులు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే రెండు వార్డుల్లోనూ పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టారు.

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డులో వైసీపీ నాయకుడు కొలుసు ఈశ్వరరావు ఆధ్వర్యంలో సింహాచలం ప్రధాన కూడలిలో వైఎస్ఆర్ చిత్రపటానికి నాయకుల పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాయకులు అప్పన్న భక్తులకు పొంగలి ప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అడివివరం పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, నాయకులు ఎర్ర వరంబాబు, లంక సత్తిబాబు, పీతల అప్పలరాజు, అడివివరం సొసైటీ డైరెక్టర్లు ఆకుల నాగరాజు, లండ వెంకటరమణ, ఆదిరెడ్డి, బోర ప్రసాద్‌రెడ్డి, యెన్ని ఈశ్వరరావు, శ్రీనివాస్, అప్పలరమణ పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభంలో వైసీపీ కార్యాలయంలో వైఎస్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణరావు, ఎంపీపీ రాంబాబు, ఆదిబాబు, ఈశ్వరరావు, సూరప్పడు, భాస్కరరావు, పద్దు, నారాయణరావు, అప్పలరాజు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన ఆర్డీఓ హుస్సేన్

ప్రజా సమస్యలు పరిష్కరించండి : ఆర్డీఓ

ఆనందపురం, సెప్టెంబరు 2 : ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆర్డీవో హుస్సేన్ ఆదేశించారు. సోమవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో భూవివాదాలపై అనేక సమస్యలు ఉన్నాయని, ఏదైనా సమస్య దృష్టికి వస్తే వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములున్నాయని వాటి పూర్తి వివరాలు కార్యాలయంలో ఉండాలని చెప్పారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్యామ్ ప్రసాద్, విద్యుత్ శాఖ ఏఈ సురేష్‌కుమార్, ఎంపీ డీవో లవరాజు, వెలుగు, హౌసింగ్, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నీళ్లకుండీలులో ఆక్రమణల తొలగింపు

ఆనందపురం, సెప్టెంబరు 2 : మండలంలోని నీళ్లకుండీలు జంక్షన్‌లో ప్రభుత్వ భూమిలో ఉన్న ఆక్రమణలను రెవెన్యూ అధికారులు సోమవారం తొలగించారు. గిడిజాల సర్వే నెంబరు 333/2లో సుమారు రూ. 40 లక్షల విలువ చేసే అయిదు సెంట్లు స్థలాన్ని కొంతమంది ఆక్రమించినట్టు స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఆర్ఐ మణికంఠ, వీఆర్ఓ అప్పారావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆక్రమిత స్థలం ప్రభుత్వ పోరంబోకు భూమిగా గుర్తించి అందులో ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు

సిరిపురం, ఆగస్టు 2 : సిరిపురంలోని వాల్మీకి క్యాంపస్‌లో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతుత్సవాలు పురస్కరించుకుని వైజాగ్ మాస్టర్ మైండ్స్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సోమవారం పురస్కారాలు అందజేశారు. నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల నుంచి యాజమాన్యం ఎంపిక చేసిన ఉపాధ్యాయులను సత్కరించి, పురస్కారాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ మైండ్స్ వైజాగ్ బ్రాంచ్ అడ్మిన్ ప్రిన్సిపాల్ సీహెచ్ అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా జాబ్ స్కామ్ కేసు దర్యాప్తు

ఎండాడ, సెప్టెంబరు 2 : డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాల పేరుతో కంబోడియా దేశానికి వెళ్లి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్న నగరానికి చెందిన మరో యువకుడ్ని సైబర్ క్రైమ్ పోలీసులు సురక్షితంగా నగరానికి తీసుకువచ్చారు. నగరానికి చెందిన పలువురు యువకులు కంబోడియా, మయన్మార్, బ్యాంకాక్ దేశాలకు వెళ్లి జాబ్ స్కామ్ కేసులో ఇరుక్కున్న విషయం తెలిసిందే. గతంలో చాలా మందిని సురక్షితంగా నగరానికి తీసుకువచ్చిన సైబర్ క్రైమ్ పోలీసులు సోమవారం బొద్దపు మోహన్ అనే యువకుడ్ని తీసుకువచ్చారు. ఈ కేసును పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై హత్యాయత్నం

పద్మనాభం, సెప్టెంబరు 1 : తన భార్యతో చనువుగా ఉంటున్నాడన్న కారణంతో యువకుడిపై భర్త హత్యాయత్నం చేశాడు. పద్మనాభం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని పాండ్రంగి పంచాయతీ పాత సామయ్యవలసకు చెందిన రౌతు రమణ లారీ డ్రైవరు. ఆయన వద్ద క్లీనరుగా పని చేస్తున్న కోన శ్రీనివాస్ తన భార్యతో చనువుగా ఉంటున్నాడని అనుమానించాడు. దీంతో శ్రీనివాస్‌ను ఈనెల 1న రాత్రి 7.30గం.ల సమయంలో మందు పార్టీకి పిలిచి గోస్తనీ నది తీరంలోని పొదల వద్దకు తీసుకువెళ్లాడు. మందు కోసం డబ్బులు తానే ఇచ్చి మద్యం తెప్పించారు. ఇద్దరూ కలిసి మద్యం సేవిస్తున్న సమయంలో ముందుగానే వేసిన పథకం ప్రకారం రమణ కత్తితో శ్రీనివాస్‌పై దాడి చేశారు. దీంతో శ్రీనివాస్ తలపై గాయంతో తప్పించుకుని పారిపోయాడు. సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రి నుంచి వచ్చిన ఎంఎల్‌సీ రిపోర్టు మేరకు సీఐ సీహెచ్ శ్రీధర్, ఎస్సై సురేశ్ ఆసుపత్రికి వెళ్లి బాధితుడు నుంచి వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇగ్నో అడ్మిషన్ల గడువు పెంపు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 2 : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) జూలై 2024 సంవత్సరానికి గాను వివిధ దూర విద్యా కోర్సులతో పాటు ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు తేదీని ఈనెల 10 వరకూ పొడిగించినట్టు ఇగ్నో సీనియర్ ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వర్సిటీ అందిస్తున్న సర్టిఫికెట్, సెమిస్టర్ బేస్డ్ ప్రోగ్రామ్ తప్ప మిగతా అన్ని డిప్లొమా, పీజీ, డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పొడిగించినట్టు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

సిరిపురం, సెప్టెంబరు 2 : జీవీఎంసీలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి. వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విభాగాల్లో పెండింగ్‌లో ఉన్న డెత్, 62 ప్లస్ పోస్టులను ఆయా కార్మికుల కుటుంబాలతో భర్తీ చేయాలన్నారు. శానిటేషన్ విభాగంలో అనారోగ్యంతో పనిచేయలేని 400 మంది కార్మికుల స్థానంలో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారి వారసులకు పోస్టులు వేయించాలన్నారు.అనంతరం జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కుమార్, అధ్యక్షుడు నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరికూటి రాజు, ఎంవీ ప్రసాద్, జేఆర్ నాయుడు, జి. అప్పారావు, రమణ, గణేష్, నాగరాజు, అప్పారావు, ఈశ్వరరావు శ్రీను, పాల్గొన్నారు.